నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ప్రకాశం బాపట్ల
ఆదివారం 9 ఫిబ్రవరి 2025 పేజీలు 8







ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ శనివారం నగరంలోని 31వ డివిజన్ విజయ్ నగర్ కాలనీలో పర్యటించారు. అక్కడే ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు.

# కేంద్ర ప్రభుత్వం సహకరించాలి

**పిఎం ఆదర్శ గ్రామ్ యోజన రూ.50 లక్షలకు పెంచాలి**

**పిఎంఏజెఏవై సంక్షేమ వసతిగృహాలకు నిధులు విడుదల చేయాలి**

**ఢిల్లీలో జరిగిన సమన్వయ సమావేశంలో మంత్రి డాక్టర్ స్వామి**

టంగుటూరు, మేజర్‌న్యూస్: భారతదేశంలోని షెడ్యూల్డ్ సామాజిక వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా తీసుకువచ్చిన ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ్ యోజనకు సంబంధించి ఢిల్లీలో శనివారం జరిగిన సమన్వయ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి హాజరయ్యారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రి వీరేంద్రకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మంత్రి డోలా స్వామి మాట్లాడుతూ ప్రస్తుతం పీఎం ఆదర్శ గ్రామ్



యోజన కింద కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.20 లక్షలు రూ. 50 లక్షలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనితోపాటు ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన శాఖ సంబంధమైన నిధులు విడుదల చేయాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం షెడ్యూల్ వర్గాల ప్రజలకు సంక్షేమం అందించే దిశగా ముందుకు వెళ్తుందని ఈ సమావేశంలో మంత్రి తెలిపారు. పిఎం-ఏజేఏవై కింద మంజూరైన సాంఘిక సంక్షేమ వసతిగృహాలకు త్వరితగతిన నిధులు కూడా విడుదల చేయాలని కోరారు. కేంద్రమంత్రి వీరేంద్రకుమార్ సానుకూలంగా స్పందించినట్లు మంత్రి తెలిపారు.

# ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు

**ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం**

**అర్హులందరికీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు**

**'ప్రజాదర్బార్'లో ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు**



పెద్దదోర్నాల, మేజర్‌న్యూస్: ప్రజల ఆనందమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజలు సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు టిడిపి ఇన్‌చార్జ్ గూటూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. శనివారం ప్రభుత్వ పాఠశాలలోని ఆర్డిటి ఆడిటోరియంలో ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ అర్హత ఉన్న లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతిష్ఠాత్మకంగా 'ప్రజా దర్బార్' వినూత్న కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడు ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకోవటం వారి హక్కుగా భావించాలని, వ్యయ ప్రయాసలకోర్చి ఎవరి చుట్టూ తిరగకూడదనే ధృఢ సంకల్పంతో వారు సులువుగా సంక్షేమ పథకాలను అందిపుచ్చుకునే తమ కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఆయన అన్నారు. గత ప్రభుత్వం ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమంలో వ్యవహరించి చట్టబద్ధతలేని హామీ పత్రాలను లబ్ధిదారులకు ఇవ్వటం జరిగిందన్నారు. ఇందు వలన అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తున్నదని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దీపావళి పండుగ సందర్భంగా ఒక ఉచిత గ్యాస్ సిలిండర్ను పంపిణీ చేసే కార్యక్రమం చేపడతామని ఆయన



మిగతా 8లో



## నేరాల నియంత్రణకు పల్లెనిద్ర దోహదం: ఏఎస్పీ



బాపట్ల రూరల్, మేజర్‌న్యూస్: బాపట్ల మండలం హైదర్ పేట గ్రామంలో బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ టి. పాండురంగ విఠలేశ్వర్ పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలతో మాట్లాడి ఊరి విశేషాల గురించి తెలుసుకొని ప్రజలందరూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ విధిగా ధరించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని, వివిధ రకాల సైబర్ నేరలు గురించి అవగాహన కల్పించి ఊరిలో ఎలాంటి గొడవలకు తావు లేకుండా గ్రామ పెద్దల సమక్షంలో ఊరి ప్రజలు చర్చించుకుని నిర్ణయం తీసుకోవాలని సూచించారు. బాపట్ల రూరల్ సీఐ శ్రీనివాస రావు, ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



భట్టిప్రోలు,మేజర్ న్యూస్: మండల గ్రామమైన వెల్లటూ రు గ్రామకాపురాస్తుడు లుక్కా సీతారామయ్య పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు దగ్ధమైంది.పూరిల్లు కరెంటు షార్ట్ సర్క్యుయిట్ వల్ల మంటలు అంటుకుని పూర్తిగా కాలిపోయింది.ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.ఆస్తి నష్టం జరిగినదని తెలియ వచ్చింది.ప్రస్తుతం గ్రామస్తులు , ఫైర్ డిపార్ట్మెంట్ వారు మంటలను అదుపులోకి తేవటం తో చుట్టుప్రక్కల ఇండ్ల వారు ఊపిరి పీల్చుకున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన అశోక్‌బాబు



భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: భట్టిప్రోలు మండల పరిధిలోని అక్కివారిపాలెం గ్రామానికి చెందిన వైఎస్ఆర్సీపీ నాయకులు బేతాళ రంగారావు-వాణి ల కుమారుడి వివాహ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి,నూతన వధూవరులయిన బేతాళ విజయ్-శృతి లను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,వేమూరు నియోజకవర్గ ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు ఆశీర్వదించారు.అశోక్ బాబు వెంట ఎంపీపీ దావూరి వెంకటలలితా మల్లేశ్వరరావు,పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ సిరాజుద్దీన్,నాయకులు బేతాళ సురేష్,జల్లి జోష్ కాంత్,దాసరి కిరణ్ తదితర వైఎస్ఆర్సీపీ నాయకులు పాల్గొన్నారు.

## నగరంలో ఆరు దరఖాస్తులు



నగరం, మేజర్‌న్యూస్ : కల్లుగీత కులాలకు రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించి నందున స్థానిక మండల పరిధిలోని గౌడ్ కులస్తులకు ఒక షాపు కేటాయించారని, అర్హులైన జిల్లాకు చెందిన గౌడ్ కులస్తుల నుంచి దరఖాస్తులు కోరగా ఆరు దరఖాస్తులందాయని స్థానిక పొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిఐ మార్టూరి శ్రీరామ్‌ప్రసాద్ చెప్పారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కాంపౌండ్‌లోని పిజిఆర్ హాలులో నిర్వహించే లాటరీలో దరఖాస్తు చేసిన వారంతా పాల్గొనాలని శ్రీరామ్‌ప్రసాద్ చెప్పారు.

## నేడు విద్యుత్తుకు అంతరాయం

బాపట్ల, మేజర్‌న్యూస్: నేడు 08-02-25 రెండోవ శని వారం కావున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు టౌన్ లో లైన్ ల మరమ్మత్తు కార్యక్రమం ఉంది కావున పట్టణ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుంది అందరు సహకరించాలని కోరారు బాపట్ల విద్యుత్ శాఖ పట్టణ ఏఇ బోలగాని సాయి శ్రీనివాస్.

# అవినీతి ఆప్‌ను ఊడ్చేశారు

### ఢిల్లీ ప్రజలు కోరుకున్న పాలన చూస్తారు : డాక్టర్ ఏలూరి



మార్కాపురం, మేజర్‌న్యూస్: ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం పట్ల ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. 26 ఏళ్ల తరువాత ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు అయినందుకు దేశ ప్రజలు ఎంతో సంతోషిస్తున్నారని చెప్పారు. అవినీతి ఆప్ ని వారి చీపురుతోనే ప్రజలు ఊడ్చిపడేశారన్నారు. ఇక నుంచి ఢిల్లీలో ప్రజలు కోరుకున్న పాలనను చూస్తారని జోస్యం చెప్పారు. ఈ సందర్భంగా బీజేపీ విజయం కోసం పనిచేసిన ప్రతి ఒక్క నాయకునికి, కార్యకర్తకు, అభిమానులకు మరీ ముఖ్యంగా రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా బీజేపీకి బాసటగా నిలిచిన తెలుగు ఓటర్లకు కూడా ధన్యవాదాలు తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీకి , బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ.నడ్డాకు అభినందనలు తెలియజేశారు. కాగా మద్యం కుంభకోణం కేసులో నిందితులుగా ఉన్న ఆప్ అధినేత కేజ్రీవాల్, మనీష్ సిసోడియాకు ప్రజలు మంచి గుణపాఠం చెప్పారన్నారు. ఈ సందర్భంగా కేజ్రిని ఓడించిన బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతున్నట్టు చెప్పారు. ఇక ఢిల్లీలో గెలిచిన ఉత్సాహంతో సౌత్ ఇండియాలోని అన్ని రాష్ట్రాల్లో కూడా కాషాయ జెండా ఎగరెయ్యాలన్నారు. ఏపీలో ఎలాగూ కూటమి అధికారంలో ఉందని ఇక మిగిలిన రాష్ట్రాల్లో కూడా బీజేపీ జెండా ఎగరేయడానికి శక్తివంచన లేకుండా కృషి చెయ్యాలని ఇందుకోసం యువత అంతా సంఘటితం అయ్యి నవభారత నిర్మాణం కోసం పోరాటం చేయాలన్నారు.

# వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేయించాలి



అద్దంకి, మేజర్‌న్యూస్: ప్రతి గ్రామంలోని గర్భిణీలకు చిన్నారులకు వ్యాధి నిరోధకటేకాలు తప్పక వేయించాలని జిల్లా టీకాల నియంత్రణ అధికారి డాక్టర్ మనోజ్ అన్నారు. మండలంలోని శింగరకొండపాలెం, పురపాలక సంఘం పరిధిలోని పట్టణ ఆరోగ్య ఉపకేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. స్థానిక ఆరోగ్య సిబ్బందితో మాట్లాడారు. మొత్తం ఐదురకాల టీకాలను చిన్నారులకు అందించాల్సి ఉండగా బీసీవీ, పెంటావలెంట్ టీకాలు పూర్తిస్థాయిలో అందుబాటులోలేవన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వైద్యఆరోగ్య కార్యాలయం నుంచి బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని ఆరోగ్యకేంద్రాలకు అందినట్లు చెప్పారు. ఉమ్మడి ప్రకాశం నుంచి చీరాల, పర్చూరు. అద్దంకి నియోజకవర్గాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాలకు టీకాలు అందాల్సి ఉందన్నారు. కాకానిపాలెం అర్బన్‌ఆరోగ్యకేంద్రం వద్ద టీకాలు అందుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈనెల 10వ తేదీ జరుగు జాతీయ నులిపురుగుల నిర్మూలనలో సిబ్బంది చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ శ్రీహర్ష, ఎంపీహెచ్ వో అద్దంకి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# పరి సమాప్తమైన శ్యామలాదేవి నవరాత్రులు



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: భట్టిప్రోలులో వేంచేసి యున్న శ్రీబాలా త్రిపుర సుందరి సమేత హేమవిఠలేశ్వర స్వామి వారి దేవస్థానంలో మాఘమాస శుద్ధ పాడ్యమి నుండి శ్యామలాదేవి నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జరిగాయని నిర్వాహకులు అల్లం వెంకటేశ్వరరావు తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామల దేవికి విశేష పూజతో పాటు శనివారం ఉద్వాసన కార్యక్రమం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పెనుగొండ శ్రీనివాసరావు-నగరాజకుమారి దంపతులు పది రోజులు పాటు పూజా కార్యక్రమంలో క్రమం తప్పకుండా పాల్గొన్నారన్నారు. అల్లం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తూనుగుంట్ల ఝాన్సీ రాణి,కె.వి.రామారావు, నాగలక్ష్మి, వెంకట నరసమ్మ,రమా కుమారి,శ్రీవాణి, పసుపులేటి పద్మ,ద్రా క్షాయి ని,లక్ష్మి, వరలక్ష్మి, కోటి లింగమ్మ, వెంకటరత్నం, నాగ రాణి, హారిక,ఉష, నాగమ ల్లేశ్వరి మొదలగు వారు పాల్గొన్నార న్నారు. అల్లం వెంకట్రావు ఆలయాన్ని అలంకరణ చేసి కావలసిన వనరులను సమ కూర్చారు. శ్యామల నవరాత్రుల సందర్భంగా అధిక సంఖ్యలో మహిళలు భక్తులు పాల్గొన్నారు.

# రేపు నులిపురుగుల నిర్మూలనకు మాత్రలు పంపిణీ



నగరం, మేజర్‌న్యూస్: ప్రపంచ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 10వ తేదీ అనగా సోమవారం మండలంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న 1-19 సంవత్సరాలున్న విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనానంతరం ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు ధూళిపూడి పిహెచ్‌సి వైద్యాధికారులు ఆర్. జాన్‌ప్రసాద్, ఎస్‌కె నజీలాపర్వీన్‌లు చెప్పారు. శనివారం మండలంలోని ధూళిపూడి పిహెచ్‌సిలో ఎఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లకు నిర్వహించిన శిక్షణలో వారు పాల్గొని మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగులుండటంతో ఆకలి లేకపోవటం, వికారం, వాంతులు, కడుపునొప్పి, రక్తహీనతతో పాలిపోయినట్లుంటారని, ఆల్బెండజోల్ మాత్రలు 400 ఎంజి మింగించటంతో ప్రేగుల్లోని నులిపురుగులు చనిపోయి మలం ద్వారా బయటకువచ్చి ఆరోగ్యంగా వుంటారన్నారు. మండలంలో 4 వేల మంది పిల్లలున్నందున తల్లిదండ్రులు సహకరించి ఆయా పాఠశాలల్లో ఈ మాత్రలు వేయించేందుకు సహకారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్ర మంలో ధూళిపూడి పిహెచ్‌సి సిహెచ్‌ఓ ఎస్. బాబురావు, సూపర్‌వైజర్లు త్యాగరాజు, కోటేశ్వరమ్మ, ఆయా గ్రామాల ఎఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణం శివాలయం రోడ్ లో గల ఏ వి వి ఉన్నత పాఠశాల లో 90-91 సంవత్సర విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. స్నేహితులు,ఉపాధ్యాయులు మధ్య జరిగిన గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ పాఠశాలలో చదువుకోవటం వలన జీవితంలో మంచి స్థాయిలో ఉన్నామని వారి మాటలతో తెలియజేశారు. పూర్వ విద్యార్థులందరూ కలిసి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆటల పాటలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై సత్యవతి మాట్లాడుతూ మా తల్లి నేను నా పిల్లలు మూడు తరాలు ఇదే పాఠశాలలో విద్యనభ్యించామని, ఈ పాఠశాలలో చదివి ఉపాధ్యాయునిగా ప్రధానోపాధ్యాయునిగా పనిచేసినందుకు గర్వపడుతున్నానని తెలియజేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ, పూర్వ విద్యార్థులు, స్కూల్ మేనేజ్మెంట్ వారి పాత్ర కీలకమని గతంలో మన బ్యాచ్ కారు పాఠశాల అభివృద్ధికి చేసిన ఆర్థిక సహాయం అభినందనీయం అని తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకొని ఉపాధ్యాయునిగా ప్రధానోపాధ్యాయునిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వై సత్యవతిని పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఆమెతోపాటుగా పాఠశాలలో విద్యనభ్యసించి ఉపాధ్యాయులుగా కొనసాగుతున్న వారిని సన్మానించారు.

## ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ కైవసం



నగరం, మేజర్‌న్యూస్ : దేశ వ్యాప్తంగా ఎక్కడ ఎన్నికలు జరిగినా భారతీయ జనతా పార్టీనే కైవసం చేసికొంటుందని స్థానిక మండల బీజేపీ అధ్యక్షులు జుజ్జువరపు సురేష్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ నాయకత్వంలో సమగ్రాభివృద్ధిని ప్రతి ఒక్కరూ కాంక్షిస్తున్నారనేందుకు ఢిల్లీలో జరిగిన ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. 48 శాతం ఓట్లతో 48 స్థానాలు బీజేపీకి అందించిన ఢిల్లీ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అవినీతి, బంధుప్రీతి, తీవ్రవాద భావజాలం కలిగిన ఆప్ పార్టీకి ఢిల్లీ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కాగా, ఢిల్లీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసికోవటంపట్ల బీజేపీ నాయకులు ఇంకొల్లు మాణిక్యారావు, అద్దేపల్లి రాఘవులు, అంకెం శివనాగేశ్వరరావు, యల్లాప్రగడ సీతాపతి, కోటపాటి శివరామకోటేశ్వరరావు, బయ్యన వెంకట్రావులు ఢిల్లీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## అవయవదానంతో అమరత్వం

### -డాక్టర్ కొప్పుల సిద్ధార్థ



బాపట్ల టౌన్, మేజర్ న్యూస్: అవయవదానంతో అమరత్వం పొందవచ్చు. మనుషులు చిరంజీవులుగ మారవచ్చు. ఎందరో జీవితాలలో వెలుగులు నింపవచ్చు. కనుక అవయవదానంపై అపోహలు వీడి, ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.సిద్ధార్థ పిలుపునిచ్చారు. అవయవ దాతల కోసం దేశ వ్యాప్తంగా లక్షలాదిమంది ఎదురుచూస్తున్నారు. అవయవ దానం ద్వారా వారందరికీ పునర్జన్మ ప్రసాదించవచ్చు. మరణం తర్వాత, శరీరదానం వైద్య రంగ పరిశోధనలకు, కొత్త ఆవిష్కరణలకు దోహదపడుతుంది.శనివారం అవయవదానం పై ఫోరం ఫర్ బెటర్ బాపట్ల వారు ప్రచురించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పి సి సాయి బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిశ్చితార్థ వేడుకల్లో ఎరిక్షన్‌బాబు



పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: పట్టణంలోని లహరి ఫంక్షన్ హాల్‌లో వెచ్చ వారి నిశ్చితార్థ వేడుకలలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. తెలుగుదేశం మండల కన్వీనర్ ఏరువా మల్లికార్జునరెడ్డి, బట్టు సుధాకర్ రెడ్డి, ఆర్. సుబ్బరత్నం, ఆర్.నరసింహారావు, లాయర్ కాశయ్య, చంటి, దొడ్డ శేషాద్రి, ఈదర మల్లయ్య, కొప్పుల సుబ్బారెడ్డి, ఎస్కే మాబు, దేసు నాగేంద్రబాబు, దేవయ్య పాల్గొన్నారు.

# టెన్త్ విద్యార్థులకు ఒత్తిడి తగ్గించేందుకే మెడిటేషన్ క్లాసులు



చీమకుర్తి, మేజర్‌న్యూస్: స్థానిక రచ్చుమిట్ట సెంటర్ నందు గల భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఒంగోలు, రామకృష్ణ మిషన్ ఆధ్వర్యం లో మెడిటేషన్ క్లాసులు నిర్వహించడం జరిగింది. రామకృష్ణ మిషన్ బృందం విద్యార్థులతో ముచ్చటించి ఏకాగ్రతను పెంచుకునే విధానం, ఏ విధంగా ఒత్తిడిని జయించాలి, చేసే పనిమీద ఏ విధంగా మనసు లగ్నం చేయాలి, ప్రతికూల(నెగటివ్ థాట్స్) ఆలోచనలను ఏ విధంగా నియంత్రించుకోవాలి వంటి విషయాలని చాలా చక్కగా వివరించారు. వారిని ధ్యానంలో నిమగ్నం చేస్తూ తద్వారా వారేమి అనుభూతి చెందారో ప్రయోగపూర్వకంగా వివరిస్తూ ధ్యానం యొక్క మెడిటేషన్ యొక్క ఉపయోగాలను వివరించారు. అనంతరం విద్యార్థులు ఈ సెషన్ తమకెంతో ఉపయోగపడిందని.. మనసు తేలికగా అనిపించిందని తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ జయకృష్ణ మాట్లాడుతూ.. పదవ తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురవకుండా చక్కగా ఏకాగ్రత తో పరీక్షలు రాయడానికే కాకుండా వారు జీవితంలో ఆత్మవిశ్వాసం తో ముందడుగు వేయడానికి ఇలాంటి మెడిటేషన్ ప్రోగ్రాంలు ఉపయోగపడతాయని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో భాష్యం జోనల్ ఇన్ ఛార్జ్ శ్రీ కృష్ణ గణేష్, బ్రాంచ్ ఫాలో అప్ ఇన్ ఛార్జ్ ఆజాద్ పాల్గొన్నారు.

# అసంఘటిత రంగ కార్మికులందరిని ఇశ్రామ్ పథకంలో చేర్చాలి

## నిధులు కల్పించి కార్మికులందని భాగస్వాములని చేయాలి- ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కె.వెంకటసుబ్బయ్య పిలుపు




ఒంగోలు, మేజర్‌న్యూస్: స్థానిక సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సమావేశం సయ్యద్ యాసిన్ అధ్యక్షత జరిగింది. ఈ సమావేశంనకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ కా.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గం పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని విశాఖ ఉక్కు కర్మాగార మనుగడకు ఇచ్చిన 11.400 కోట్లు కంటి తుడుపు చర్య మాత్రమేనని, సేయిల్‌లో విలీనం చేయాలనీ డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలనీ కార్మిక హక్కులు పునరుద్దరణ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని యూనియన్ల బాధ్యులు కార్మికులను విరివిగా యూనియన్‌లో చేర్పించాలని యూనియన్ లేని రంగాలలో కొత్త యూనియన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇ శ్రమ్ కార్డు కార్మికులని చేర్పించాలని కోరారు. యూనియన్ సహాయ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు పథకం వివరాలు వివరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యంయల్ నారాయణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటరావు, రాష్ట్ర హమాలీ కార్మిక ఉపాధ్యాక్షులు కె.శుభాన్ నాయుడు, మార్కాపురం, కనిగిరి, వై.పాలెం, కొండేపి, ఒంగోలు నగరంలోని అన్ని యూనియన్‌ల నాయకులు పాల్గొన్నారు.

# రామ్ భూపాల్ రెడ్డికి సియం చంద్రబాబు ఆల్బమ్ బహుకరణ



గిద్దలూరు, మేజర్‌న్యూస్: భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి తన మనసులోని మాటను మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రతి నెల చివరి ఆదివారం దేశ ప్రజలనుద్దేశించి రేడియో ద్వారా ప్రసంగిస్తున్న విషయం తెలిసిందే. జాతీయ స్థాయిలో వివిధ రంగాలలో సేవలందిస్తున్న ప్రముఖులను గుర్తించి అటువంటి వారందరిని దేశ రాజధాని ఢిల్లీకి ఆహ్వానించి వారి సలహాలను తీసుకొని గౌరవిస్తున్నారు. అందులో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల నుండి 6 గురిని ఎంపిక చేశారు. అందులో భాగంగా ప్రకాశం జిల్లా రాచర్ల మండలం, యడవల్లి గ్రామంనకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మార్కాపురం రామ్ భూపాల్ రెడ్డికి అవకాశం దక్కింది. భారత ప్రధాన మంత్రి గారు జాతీయ స్థాయిలో 100 మందిని గుర్తించి, వారు సమాజానికి చేస్తున్న సేవలతో పాటు వారి ఫోటోలను భారత ప్రభుత్వమే ముద్రించి కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు పంపిణీ చేసి ఉన్నారు. అందుకు సంబంధించిన ఫోటో ఆల్బమ్ రామ్ భూపాల్ రెడ్డికి శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అందజేశారు.

# ఐక్యతతో ఎస్సీ వర్గీకరణను అడ్డుకుందాం : బిల్లా చెన్నయ్య


ఒంగోలు, మేజర్‌న్యూస్ : మాలలంతా ఐక్యతతో ఎస్సీ వర్గీకరణను అడ్డుకుందామని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిల్లా చెన్నయ్య పిలుపునిచ్చారు. శనివారం నంద్యాల పట్టణంలో మాల సోదరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి బిజెపి మంద కృష్ణను అడ్డుపెట్టుకొని వర్గీకరణ చేసి దళితులను ఆర్థికంగా రాజకీయంగా దెబ్బతీసి కుట్ర పన్నుతోందన్నారు. రాబోయే తరాలను నాశనం చేసే విధంగా క్రిమిలేయర్‌ను అనుసరిస్తున్నారన్నారు. అందుచేత మనందరం కలిసికట్టుగా వర్గీకరణ పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఆపకపోతే మన బిడ్డల భవిష్యత్తును మనమే రాజ్యాంగం రాకముందు ఉన్నటువంటి పరిస్థితుల్లోకి నెట్టిన వాళ్ళం ద్రోహులు అవుతావని కనుక ఇంటికి ఒకరుగా వర్గీకరణ పోరాటం కోసం తరలిరావాలని తెలియజేశారు.



# పేస్‌లో మెగా ఉచిత వైద్యశిబిరం

టంగుటూరు, మేజర్‌న్యూస్: స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో కిమ్స్ హాస్పటల్ డాక్టర్స్, వారి సిబ్బందితో మెగా ఉచిత వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్స్ హాస్పటల్ నుండి డా.బి.కిరణ్ జ్యోతి ఆప్తామాలజిస్ట్, డా.బి.రామాంజనేయులు జనరల్ మెడిసిన్, డా.వి.ప్రీతి గైనిక్‌లు పాల్గొని అధ్యాపక బృందానికి, విద్యార్థులకు వివిధ రకాల పరీక్షలు ఇసిజి, షుగర్, బిపి, కంటి పరీక్షలు, మహిళలకు గైనిక్ డా.ప్రీతి వారి సమస్యలకు మెడిసిన్, ఆరోగ్య చిట్కాలు వివరించారు. అదే విధంగా కంటి చుక్కలను, కండర నొప్పి లోషన్స్, గాస్ట్రిక్, జ్వరం, నొప్పులు, యాంటీ బయోటిక్, బికాంప్లెక్స్ తదితర మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డా.యం.శ్రీధర్, ప్రిన్సిపాల్ డా.జివికె మూర్తి మాట్లాడుతూ కిమ్స్ హాస్పటల్ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్టూడెంట్ అఫైర్స్ డా.ఆర్.వీరాంజనేయులు, అకడమిక్ డీన్ డా.సివి సుబ్బారావు, ఏఓయం రమణ బాబు, హెల్త్ వాచ్ కమిటీ, ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్స్ డా.పి.బ్రహ్మం, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

# పెమ్మసానిని మర్యాదపూర్వకంగా కలసిన దంతులూరు



పొదిలి,మేజర్‌న్యూస్: మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గుంటూరు ఎంపీ, కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ని శనివారం టిడిపి యువ నాయకులు దంతులూరు వెంకట్రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు అభినందనలు తెలిపారు

# చీరాలలో బీజేపీ సంబరాలు

చీరాల, మేజర్‌న్యూస్: చీరాల ఢిల్లీ పీఠాన్ని భారతీయ జనతా పార్టీ కైవసం చేసుకోవడంతో బాపట్ల జిల్లా చీరాలలో బిజెపి నాయకులు కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక గడియారస్తంభం సెంటర్ లో విజయోత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. బాణాసంచాలు కాల్చి స్వీట్లు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. ఎన్డీఏ కూటమి భాగస్వామ్యంలో భాగంగా ఢిల్లీ ఎన్నికల ఫలితాలలోభారతీయ జనతా పార్టీ విజయ డంకా మోగించడానికి ప్రధాన పాత్ర పోషించిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని ఎన్డీఏ బోలోపేతానికి ఇది నిదర్శనం అని అవినీతి ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని ఢిల్లీ ప్రజలు గద్దెదించారు. సంక్షేమం అభివృద్దే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని ముందుకు నడుపుతున్నారని కొనియాడారు.

# ఘంటసాల 51వ వర్ధంతి మహోత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ



చీరాల, మేజర్‌న్యూస్: ఘంటసాల గానామృతం నేటి రేపటి తరాలకు అందించుదాం ప్రపంచ తెలుగు వారి సాంస్కృతిక ప్రతీక పద్మశ్రీ ఘంటసాల ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక వ్యవస్థాపక జాతీయఅధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. చీరాల ఘంటసాల విగ్రహం సెంటర్‌ను రాష్ట్రస్థాయి సాంస్కృతిక కేంద్రముగా అభివృద్ధి చేయాలని కామాక్షి హాస్పిటల్ ఎండి తాడివలస దేవరాజు అన్నారు. ఘంటసాల 51వ వర్ధంతి మాసోత్సవాల సందర్భంగా ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక ఆధ్వర్యంలో చీరాలలోని ఘంటసాల విగ్రహం వద్ద కరపత్రాలు ఆవిష్కరణ జరిగింది. ముందుగా ఈ కార్యక్రమానికి కామాక్షి హాస్పిటల్ ఎండి తాడివలస దేవరాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఘంటసాల 51వ వర్ధంతి సందర్భంగా ప్రధాన అంశంగా చర్చించాము. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ తెలుగువారి సాంస్కృతిక ప్రతీక పద్మశ్రీ ఘంటసాల అని అన్నారు. భావితరాలకు మన తెలుగువారి సాంస్కృతిక వారసత్వాన్ని అందించుదాం కోట వెంకటేశ్వర రెడ్డి పేర్కొన్నారు. ఘంటసాల గానామృతం నేటి రేపటి తరాలకు అందించుదాం ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అడే నరసింహారావు, బక్క జయరామిరెడ్డి, నంగు రాజశేఖర్, బి.చిన్నబాబు నేల ధరరాజు, గురుముచ్చు సుధీర్, మల్లెల రత్నరాజు, డేటా ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# మోడీ, చరిష్మాతోనే ఢిల్లీలో విజయం



దర్శి, మేజర్‌న్యూస్: దేశ ప్రధాని నరేంద్ర మోడీ, చరిష్మాతోనే ఢిల్లీలో విజయం సాధించినట్లు జిల్లా బిజెపి అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసులు అన్నారు. ఢిల్లీలో బిజెపి గెలుపుతో దర్శిలో నాయకులు సంబరాలు చేసుకున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ప్రకాశం జిల్లా భారతీయ జనతా పార్టీనూతన అధ్యక్షులుగా నియమితులైన సెగ్గం శ్రీనివాసులు దర్శి నియోజకవర్గ మండల అధ్యక్షులతో దరిశి నియోజకవర్గ కన్వీనర్ మాడపాకుల శ్రీనివాసులు ఇంట్లో సమావేశమయ్యారు. శ్రీనివాసులు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని ప్రజలు నమ్ముతున్నారని అందుకు ఢిల్లీ విజయం నిదర్శనమని అన్నారు. దర్శి గడియార స్తంభం సెంటర్లో బాణసంచ కాల్చి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు వారితోపాటు మాజీ జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, ఉపాధ్యక్షులు తిండి నారాయణ రెడ్డి, ముండ్లమూరు మండల అధ్యక్షుడు ఎం.శేషయ్య, దొనకొండ మండల అధ్యక్షుడు మునయ్య, కురిచేడు మండల అధ్యక్షుడు కోరంగి నాగేశ్వరరావు దర్శి రూరల్ మండల అధ్యక్షుడు కాకర్ల నాగసాయి ఆంజనేయులు, అత్యుత్త గురువార్జున రావు, చెరుకూరి అనిల్, బత్తుల ప్రసాద్, నియోజకవర్గ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి భారీ విజయంపై కూటమి శ్రేణుల హర్షం



సి.యస్.పురం, మేజర్ న్యూస్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి భారీ విజయంపై కూటమి శ్రేణుల హర్షం వ్యక్తం చేశారు. మండల బిజెపి అధ్యక్షుడు ఇండ్ల వెంకట సత్యం ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, ప్రధానకార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, గ్రంధి హేమసుందరం, బత్తుల వెంకటాద్రి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి

## రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య




సింగరాయకొండ, మేజర్‌న్యూస్: రోజు రోజుకు దేశంలో అభివృద్ధి చెందుతున్న శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్న అభివృద్ధి కొత్త కొత్త ఆవిష్కరణల గురించి గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య సూచించారు. శనివారం పట్టణంలోని గీతం విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ డీప్ ఇంటెలిజెన్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ దేశంలో శాస్త్ర సాంకేతిక వైజ్ఞానిక పరిశోధనల రంగంలో అభివృద్ధి చెందుతున్న విజ్ఞానాన్ని కొత్త కొత్త పరిశోధనలు ఆవిష్కరణలు గురించి పాఠశాల స్థాయినుంచి అవగాహన కలిగి ఉండాలని పిలుపు ఇచ్చారు. ఎన్‌డిఏ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకునేందుకు ప్రత్యేకంగా రాష్ట్రం లో ముఖ్యమంత్రి విజన్ 2020 తరహాలో 2047కి శ్రీకారం చుట్టారని దాన్ని గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు అందిపుచ్చు కునేవిధంగా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని తెలిపారు . ప్రత్యేకించి ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, డీప్ టెక్నాలజీ, విజన్ 2047 దిశగా ముందుకు సాగుతున్న ప్రభుత్వ పథకాలు కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు అందిపుచ్చు కుని ఆధునిక సమాజ నిర్మాణానికి ఆవిష్కరణలకు తోడ్పడాలని ఆయన కోరారు.గ్రామీణ ప్రాంతం లో విద్యార్థులకు రోబో టెక్, డీప్ టెక్నాలజీ ద్వారా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న గీతం విద్యా సంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలను సత్య నారాయణ, సిఐ చావా హజరత్తయ్య, సంస్థ చైర్మన్ లక్ష్మణ రావు పరిశీలించి విద్యార్థులను ఆయా ఆవిష్కరణల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గీతం విద్యా సంస్థల చైర్మన్ లక్ష్మణ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతుల పట్ల అశ్రద్ధ పనికిరాదు




మార్కాపురం, మేజర్‌న్యూస్: పట్టణంలోని టీడీపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో కొనకల మిట్ల తాసిల్దార్‌పై ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనకనమిట్ల మండలం చిన్నారి కట్లలో ఉన్న తమ భూమీ 17 ఎకరాల 32 సెంట్లను తప్పుడు పత్రాలు సృష్టించి వైసిపి నేత సోదరుడు ఆన్లైన్ చేపించుకున్నారని బాధితుడు ఒంగోలు శ్రీనివాసరావు ఆరోపించాడు. ఈ విషయమై పలుమార్లు తాసిల్దార్‌కు వినతి పత్రాలు అందజేసిన పట్టించుకోక పోవడంతో ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముందు తమ గోడు వెళ్లబోసుకున్న బాధితుడు. ఎమ్మెల్యే కందుల వెంటనే స్పందించి అక్కడే ఉన్న తాసిల్దార్‌ను పిలిచి ఎందుకు అశ్రద్ధ చేస్తున్నారని అయనపై ఆగ్రహం సత్యం చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని తాసిల్దార్‌కు ఆదేశించారు.

# తీరప్రాంత సంరక్షణ మనందరి బాధ్యత




బాపట్ల, మేజర్‌న్యూస్: 20 వ రాష్ట్ర సర్వసభ్య సమావేశాలు మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో శీలం వారి పాలెం లో హితైషిని కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆదరణీయ మురళీధర్ జి (అఖిలభారత సీమ జాగారణ మంచ్ సంయోజక్ ) సభలో పాల్గొని కొన్ని సమస్యలు ఆయన తెలియజేశారు. మత్స్యకార సంక్షేమ సమితి గత 20 సంవత్సరాలుగా మత్స్యకార గ్రామాలపై దృష్టి సారించి మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి గురించి పనిచేస్తున్న సంస్థ మత్స్యకారులు మత్స్యకార గ్రామాల గురించి ఆలోచించే సంస్థగా మత్స్యకారుల సమస్యలను తెలియజేస్తూ, ఈ ప్రపంచంలో కులవృత్తులలో అత్యంత ప్రమాదకరమైనది సముద్రంలో చేపల వేట, వేటకు వెళ్లే సమయంలో సముద్ర కెరటాలు దాటి ఎదురు వెళ్లే సమయం చాలా కీలకమైన ఘట్టంగా చెప్పుకోవాలి. నేటి వరకు ఈ కెరటాల మధ్యలో బోటు తిరగబడి చనిపోయిన వారు చాలామంది ఉన్నారు. ఈ ప్రాంతంలో ఆపదను ఎదుర్కొనేందుకు వీరందరికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఫిషర్ మెన్ లైఫ్ సేవింగ్ సేఫ్టీ టెక్నిక్ కోర్సులు( లైఫ్ సేవింగ్)లో శిక్షణ ఇప్పించగలగాలి. చీరాల బాపట్ల మండలాల మధ్యలో ఉన్నటువంటి అడవి పాలెం పంచాయితీలో ఈపురుపాలెం స్ట్రైట్ కట్ కాలవను పూడిక తీయించి ఆ కాలవలో బోట్లు కట్టుకునే వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేయాలి . సముద్ర వ్యాపారాలు మచ్చ సంపద ఉత్పత్తుల వ్యాపారాలు ఎగుమతుల్లో వస్తున్నటువంటి లాభాల్లో 25% రాయల్ టీని మత్స్య శాఖ అభివృద్ధి కి కాకుండా మత్స్యకారుల అభివృద్ధికి కేటాయించి విద్య, ఆరోగ్య సామాజిక భద్రత అభివృద్ధికి ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ ఎస్ ఎస్ ప్రాంత సంఘ చాలక్ హరి కుమార్ రెడ్డి, కోలంగారి పోలయ్య( సీమ జాగరణ మంచ్ ప్రాంతాల సంయోజక్ ) రాష్ట్ర అధ్యక్షులు ఉమ్మడి మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరిమెళ్ళ వాసు, 26 జిల్లాల నుండి మత్స్యకార సంక్షేమ సమితి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# సెయింట్ ఆన్స్‌లో ముగిసిన మైక్రోసాఫ్ట్ ప్రాజెక్ట్ వర్క్‌షాప్



వేటపాలెం, మేజర్‌న్యూస్: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో విజయవంతంగా ముగిసిన ప్రాజెక్ట్ ప్లానింగ్ సాఫ్ట్‌వేర్ మైక్రోసాఫ్ట్ ప్రాజెక్ట్‌పై రెండు రోజుల వర్క్ షాపు సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజిలో సివిల్ ఇంజినీరింగ్ విభాగ విద్యార్థులకు ప్రాజెక్ట్ ప్లానింగ్ సాఫ్ట్‌వేర్ మైక్రోసాఫ్ట్ ప్రాజెక్ట్‌పై రెండు రోజుల వర్క్‌షాపు విజయ వంతముగా ముగిసినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణా రావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు సంయు క్తముగా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. జగదీష్ బాబు మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజిల పై అనుబంధం పెంచుకోవ టంవలన ఆధునిక పరిశ్రమలలో ఉత్తమంగా రాణించవచ్చని తెలిపారు. ప్రాజెక్ట్ ప్లానింగ్ సాఫ్ట్‌వేర్ మైక్రోసాఫ్ట్ ప్రాజెక్ట్ రెండు రోజుల వర్క్‌షాపును డా.వి.శ్రీహరి, డీన్ డా.రవీంద్రనాద్ చౌదరి, ప్రొఫెసర్ నిక్‌మర్ యూనివర్సిటి, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా.టి. కిరణ్ కుమార్ తెలియజేశారు. ఈ వర్క్ షాపులో పాల్గొనటం విద్యార్థులకు ఎంతో ఉపయోగము, ఆధునిక టెక్నాలజిలపై అవగాహన కలిగిఉండటం వలన ఉన్నత ఉద్యోగాలను సంపాదించటంలో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో డా.వి.శ్రీహరి, డీన్ డా. రవీంద్రనాద్ చౌదరి, కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణా రావు సత్కరించారు. ఈ వర్క్‌షాపునకు డా.జి.విజయ్ కుమార్, కో ఆర్డినేటరుగా వ్యవహరించారు.

# ఘనంగా ఉగ్ర జన్మదిన వేడుకలు





హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి 52వ జన్మదిన పురస్కరించుకొని హనుమంతునిపాడు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వమత ప్రార్థనల అనంతరం ఉగ్ర నరసింహారెడ్డి 52వ పుట్టినరోజు సందర్భంగా 52 కేజీల భారీ కేకును పార్టీ నాయకులు కటింగ్ చేసి ఉగ్ర నరసింహారెడ్డి కి శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఉగ్ర పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం**

ఉగ్ర నరసింహారెడ్డి 52వ పుట్టినరోజు సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో 60 మంది దాతలు రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరం కత్తి తిరుపాలు పర్యవేక్షణలో జరగా రక్తదాన శిబిర నిర్వహణ జయప్రదంగా జరిగినందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు కత్తి తిరుపాలను అభినందించారు. ఈ రక్తదాన శిబిరానికి సహకరించిన తెలుగుదేశం పార్టీ నాయకులకు, రక్తదాన దాతలకు కత్తి తిరుపాలు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం 500 మందికి భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు గాయం తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ ఉడుముల సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షులు చావలి వెంకటేశ్వర్లు, దొడ్డి చింతల సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, మురహరి నరసయ్య, గాయం రామిరెడ్డి, పెంచికల రామకృష్ణ, కూరాకు బాలనారాయణ, తాతపూడి బుజ్జి, బలసాని కోటయ్య, ఉప సర్పంచ్ కత్తి కిషోర్, జనసేన పార్టీ అధ్యక్షులు ఆకుపాటి రమణ, ఆవులయ్య, కూడలి దశరథ, సుమిత్ర తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాదులో డాక్టర్ ఉగ్ర జన్మదిన వేడుకలు



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం హైదరాబాద్ నగరంలో సి.ఎస్.పురం పట్టణ టిడిపి అధ్యక్షుడు తోట చిన్నా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి ఒకరికొకరు పంచుకుని ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి ప్రజాసంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి భగవంతుని ఆశీస్సులు ప్రజల దీవెనలు సమృద్ధిగా ఉండాలని కోరుకుంటూ ఉగ్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట చిన్నా, బొబ్బూరి మణి, నాయబ్ రసూల్, షారూక్, మస్తాన్ రెడ్డి, నవీన్ కుమార్, అభిమానులు ఉన్నారు.

# కనిగిరిలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర జన్మదిన వేడుకలు



కనిగిరి, మేజర్‌న్యూస్: కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి జన్మదిన వేడుకలను టీడీపి శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అమరావతి గ్రౌండ్ లో కేకు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ప్రముఖ వైద్యులు డాక్టర్ రామయ్యనాయుడు కాపు సంఘం ఆధ్వర్యంలో కేకు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపి శ్రేణులు ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే ఎస్కెఆర్ మానసిక దివ్యంగుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం చేశారు. వికలాంగులకు, పేదలకు బట్టలు పంపిణీ చేశారు. అలాగే 12వ వార్డులో ఎస్సీ సెల్ అధ్యక్షులు బుల్లా బాలబాబు, వార్డు అధ్యక్షులు అలీస్ ఆధ్వర్యంలో పట్టణ టీడీపి అధ్యక్షులు తమ్మనేని శ్రీనివాసులు రెడ్డి ,పట్టణ యువత అధ్యక్షులు షేక్ ఫిరోజ్ కేకు కట్ చేశారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండి ప్రజా సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపి నాయకులు రాచమళ్ళ శ్రీనివాసులు రెడ్డి, తమ్మనేని వెంకటరెడ్డి, నారపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కమతం వెంకటేశ్వరెడ్డి, షేక్ అహ్మద్, వివిఆర్ మనోహరరావు, ఐవి నారాయణ, కొలిపర్తి వెంకట మారుతీ కుమార్, కోటా సురేష్, కొట్టే ప్రసాద్, ముండ్లమూరి కొండలరావు, సిరివెళ్ల వెంకట ప్రసాద్, కోటంశెట్టి చిన వీరయ్య, నున్నా శ్రీను, పసావుల వెంకటేశ్వర్లు, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

# కోవిలంపాడులో ఉగ్రన్న జన్మదిన వేడుకలు




సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని కోవిలంపాడు పంచాయతీ ప్రముఖులు, మండల టీడీపీ సీనియర్ నాయకులు షేక్ బడేనాయబ్ రసూల్(చంద్రపూర్, మహారాష్ట్ర) ఆధ్వర్యంలో కనిగిరి డైనమిక్ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి జన్మదిన వేడుకలను మహారాష్ట్రలోని చంద్రపూర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బడేనాయబ్ రసూల్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు అన్నివర్గాల ప్రజల సంక్షేమం కనిగిరి నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ఉగ్రన్న ఉన్నత పదవులు పొందాలని కోరుకుంటున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

# ‘ప్రజాదర్బార్’లో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి




మార్కాపురం, మేజర్‌న్యూస్: మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్‌లో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎమ్మెల్యేలు క్యాంప్ కార్యాలయంలో శనివారం ‘ప్రజా దర్బార్’ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ సమస్యలకు అర్జీలు ఎమ్మెల్యేకి సమర్పించారు. అప్పటికప్పుడే కొన్ని సమస్యలకు అధికారులు పరిష్కారం చూపి త్వరలోనే మిగతావి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రజా దర్బార్ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుండి స్ఫూర్తి పొంది ఈ కార్యక్రమాన్ని రూపొందించామని ప్రజలు చిన్న సమస్యలకే మంగళగిరికి వెళ్లకుండా ఇక్కడికిక్కడే పరిష్కారం చూపిస్తామని అన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని కొన్ని సమస్యలను ఇక్కడికిక్కడే పరిష్కారం చూపామని కొన్నిటికి త్వరలోనే అధికారులు పరిష్కారం చూపిస్తారని అన్నారు. పరిష్కారం కాని సమస్యలకు అక్కడే ప్రజలకు వివరించి చెప్పామని ఈ కార్యక్రమంలో అధికారులు అందరూ హాజరై సమస్యలకు పరిష్కారం చూపారని అన్నారు. ఇక ప్రతి శనివారం ఇదే క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తామని ప్రజలు ఏ సమస్యలు ఉన్న కూడా ఆ సమస్యలను మా దృష్టికి అధికారులు దృష్టికి తీసుకురావాలని అన్నారు. శనివారం జరిగిన ప్రజాదర్బార్‌లో మొత్తం 140 అర్జీలు వచ్చాయి. వాటిలో 49 అర్జీలు మార్కాపురం పట్టణం, 41 అర్జీలు మార్కాపురం మండలం నుండి, 31 అర్జీలు కొనకనమిట్ల మండలం నుండి, 19 అర్జీలు పొదిలి మండలం నుంచి వచ్చాయి.

# రెండో రోజు అదే జోష్

## ఉత్సాహంగా కొనసాగుతున్న క్విస్ ఫెస్ట్

## సందడి చేసిన సింగర్ సమీర





ఒంగోలు, మేజర్‌న్యూస్ : క్విస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరుగుతున్న క్విస్ ఫెస్ట్ - 2025 ఉత్సాహంగా సాగుతోంది. రెండో రోజు రికార్డు స్థాయిలో విద్యార్థులు హాజరయ్యారు. టెక్నికల్, కల్చరల్స్, స్పోర్ట్స్‌లో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారని క్విస్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ గాయత్రి మీడియాకు తెలియజేశారు. ఏటా ప్రతిష్టాత్మకంగా జరిగే క్విస్ ఫెస్ట్ ఈసారి మరింత ఉత్సాహంగా జరుగుతోందని చెప్పారు. దేశంలోని చాలా రాష్ట్రాల నుంచి విద్యార్థులు వచ్చి ప్రదర్శనలు ఇచ్చారు. అనేకమంది ఆన్ లైన్ ద్వారా కూడా పేపర్ ప్రజంటేషన్‌లు చేసినట్లు యాజమాన్యం వెల్లడించింది. ఇక టెక్నికల్ ఎక్స్ పోలో భాగంగా నిర్వహించిన పేపర్ ప్రజంటేషన్, రివైవ్, రీయూజ్, రీసైకిల్ థీమ్ ఎక్స్ పో, టెక్ క్విజ్, టెక్ ఫన్, పోస్టర్ ప్రజంటేషన్, గ్రూప్ డిస్కషన్ తదితర అంశాల్లో 40 కాలేజీల నుంచి దాదాపు 700 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ఇక ఫిబ్రవరి 9న ముగింపు సభ ఫౌండర్స్‌డే జరపనున్నారు. ముగింపు కార్యక్రమానికి ఎన్‌ఐటీరాయ్‌పూర్ డైరెక్టర్ ఎన్వీ రమణారావు ముఖ్య అతిథి. క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవి హనుమంతరావు, ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ కిశోర్ బాబు, క్విస్ కళాశాలలోని వివిధ విభాగాల డైరెక్టర్లు, డీన్‌లు, హెచ్ వోడీలు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

### సందడి చేసిన సమీర భరద్వాజ్, బ్యాండ్ కాన్సర్టో

క్విస్ ఫెస్ట్‌లో భాగంగా నిర్వహించిన మ్యూజికల్ కాన్సర్ట్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సింగర్ సమీర భరద్వాజ్ తన పాటలతో విద్యార్థులను ఉర్రూతలూగించారు. ఇక బ్యాండ్ కాన్సర్టో వారి సంగీతానికి విద్యార్థులు నృత్యాలు చేసి, కేరింతలు కొట్టారు. ఇలాంటి మంచి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న యాజమాన్యానికి విద్యార్థులు ధన్యవాదాలు తెలియజేశారు. క్విస్ ఫెస్ట్‌లో తామంతా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నామని, చదువుతో పాటుగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న యాజమాన్యానికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.


# ఘనంగా ఎమ్మెల్యే ఉగ్ర జన్మదిన వేడుకలు



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: కనిగిరి నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత, ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం స్థానిక మండల టిడిపి కార్యాలయంలో అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, ప్రధానకార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు, అభిమానుల ఆనందోత్సాహాల మధ్య కేక్ కటింగ్ చేసి ఒకరికొకరు తినిపించుకుని పలువురికి పంచిపెట్టారు. అనంతరం పలువురు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలకు సేవలందించడానికి నిరంతరం శ్రమిస్తూ శాసన సభ్యునిగా ఎన్నికైన అనతికాలంలోనే కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు మంజూరు చేయిస్తూ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ఆదర్శంగా నిలిపేలా కృషిచేస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి భగవంతునిదయ పెద్దల ఆశీస్సులు ప్రజల దీవెనలతో మరింత ఉన్నత పదవులు పొంది ప్రజలకు సేవలందించాలని కోరుకుంటూ మండల టిడిపి కూటమి తరపున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు అన్నారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, ప్రధానకార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, సర్పంచులు కామనబోయిన రమణమ్మ వెంకటస్వామి, శ్రీరాంపద్మావతి, ఉపసర్పంచ్ పి.నరసయ్య, క్లస్టర్ ఇంచార్జి ఎన్.సి.మాలకొండయ్య, మండల తెలుగుయువత ప్రధానకార్యదర్శి చెరుకుపల్లె వెంకటరెడ్డి, నాయకులు ఏ.రామకృష్ణంరాజు, అమడసాని బాలకేశవరెడ్డి, బి.వెంకటాద్రి, జె.లక్ష్మీదేవి, పోకల రవిచంద్ర, డి.మోహనరెడ్డి, కాశయ్య, పి.గురుకృష్ణ, శ్రీను, పలువురు నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే ఉగ్ర జన్మదిన వేడుకలు

## శుభాకాంక్షలు తెలిపిన పోతిరెడ్డి తిరుపతిరెడ్డి



కనిగిరి, మేజర్ న్యూస్: శాసన సభ్యులు డాక్టర్ ఉగ్ర నర సింహారెడ్డి జన్మదిన వేడుకలు శనివారం నియోజక వర్గంలో అట్ట హాసంగా జరిగాయి. పార్టీ శ్రేణులు కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టిడిపి యువ నాయకులు, ప్రముఖ రియల్టర్ పోతిరెడ్డి తిరుపతిరెడ్డి అభిమాన నేత ఉగ్రకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలను ఆదుకోవడమే సంఘం లక్ష్యం

## రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం కోశాధికారి చెన్నుపల్లి


మద్దిపూడి, మేజర్‌న్యూస్: జిల్లాలోని విశ్వబ్రాహ్మణ సంఘీయులు ఎవరైనా ఇబ్బందుల్లో ఉన్నట్లయితే అటువంటి వారిని ఆదుకోవడమే విశ్వబ్రాహ్మణ సంఘం లక్ష్యమని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం కోశాధికారి, ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి అన్నారు. శనివారం మద్దిపూడి గ్రామానికి చెందిన గట్టుపల్లి శ్రీనివాసులకు గత నెల నుండి అనారోగ్యం కారణంగా గుంటూరువైద్యశాలలో చికిత్స పొందుతున్న తరుణంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయన్న విషయాన్ని సంఘం దృష్టికి తీసుకెళ్లగా వెంటనే జిల్లా సంఘం స్పందించి సంఘం గ్రూపులో వాట్సప్ ద్వారా విషయాన్ని తెలియజేసి సభ్యుల సహకారం తీసుకొని దాతల నుండి వచ్చిన రూ.38,301లను గట్టుపల్లి శ్రీనివాసులు తల్లి గట్టుపల్లి అరుణమ్మకు జిల్లా సంఘం ఆధ్వర్యంలో నగదు అందజేసారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి మాట్లాడుతూ జిల్లా సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఇప్పటి వరకు విద్యకు వైద్యానికి సంబంధించి సుమారు రూ.40లక్షలను ఇబ్బందులలో ఉన్న మన సంఘ సభ్యుల కుటుంబాలకు అందించామని తెలిపారు. అనంతరం పొదిలిలోని ఆరామక్షేత్రంను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం కార్యదర్శి పొన్నపల్లి బ్రహ్మానందం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదు మూడీ రవి ప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కుందుర్తి ఆంజనేయులు, జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రచార కార్యదర్శి ఈదుమూడి ప్రసాదు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినుకొండ శ్యామల మల్లికార్జునరావు,కేకేమెట్ల మండల అధ్యక్షులు యద్దనపూడి వీరబ్రహ్మం, పొదిలి కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ రాజశేఖర్, కోశాధికారి గుత్తికొండ కళ్యాణ్, వడ్లమాని వీర నారాయణ, నూతక్కి నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్య సంఘీయులు ఉన్నారు.

# మాలకొండపై రెండో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ఇంటూరి భూమి పూజ



వలేటివారిపాలెం, మేజర్‌న్యూస్: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం 2వ రోడ్డు నిర్మాణం కొరకు శనివారం ఉదయం జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు భూమి పూజ చేశారు. అనంతరం శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అనేది ఎంతో పవిత్రమైన పుణ్యక్షేత్రం. స్వామివారి కొండపైకి వెళ్లి స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తుల వాహనాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా 2వ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం వద్దకు ప్రతిపాదనలు పంపించాం. అందులో భాగంగా, మొదటగా జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభించడం జరిగిందని, ప్రభుత్వం నుండి అనుమతులు రాగానే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సాగర్ బాబు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పార్టీ నాయకులు కాకుమాని హర్ష, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, గుత్తా మహేశ్వరరావు, కామినేని అశోక్, కాకుమాని ఆంజనేయులు మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు



ఉలవపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని కరేడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పోలుబోయిన శ్రీనివాసులు, రత్నకుమారి దంపతుల కుమారుడు పోలుబోయిన గౌతమ్ భవాని వివాహా కార్యక్రమానికి కందుకూరు నియోజకవర్గం శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని శ్రీకృష్ణ ఆలయంలో నూతన వధూవరులను శనివారం ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు రాచగర్ల సుబ్బారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో ఎమ్మెల్యే ముత్తుముల



గిద్దలూరు, మేజర్‌న్యూస్: మండలంలోని వారనగర్‌లోని శ్రీవారి వెంకటచలపతి ప్యాలెస్‌లో గిద్దలూరు పట్టణానికి చెందిన నిమ్మకాయల శేఖర్ కుమార్తె వివాహ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఢిల్లీ ఎన్నికలలో కమల వికాసం



గిద్దలూరు, మేజర్‌న్యూస్: ఢిల్లీ ఎన్నికల ఫలితాలు భారతీయ జనతా పార్టీ అధిక మెజార్టీ సాధించింది అంటే మోడీ సారథ్యంలో కేంద్రంలో ప్రభు త్వం ప్రజలకు అందిస్తున్న సుపరి పాలన, అంతే కాకుండా బీజేపీ అధినా యకత్వం పనితీరు, రాబోయే ఎన్నికల్లో దక్షిణాదిన రాష్ట్రాలలో కమలము జండాను ఎగురవేయ బోతున్నము, ఈ ఎన్నికలలో మధ్య తరగతి, మైనార్టీ ప్రజలు కాషాయము వైపు ఉన్నారు అనేది నిజము, ఈ దేశ ఆర్థికాభివృద్ధి భారతీయ జనతా పార్టీతోనే సాధ్యము అనేది ఈ ఎన్నికలు రుజువు చేశాయి.

## బర్మా మౌనికను ఆశీర్వదించిన మండల పార్టీ నాయకులు




పిట్టలవానిపాలెం, మేజర్ న్యూస్: ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ఆదేశాల ప్రకారం పిట్టలవానిపాలెం మండలం, సంగుపాలెం గ్రామంలో బర్మా మౌనిక వివాహం సందర్భంగా ప్రధానం కార్యక్రమానికి విచ్చేసి మౌనికను ఆశీర్వదించిన మండల తెలుగుదేశం పార్టీ నాయకులు లక్కం రాజు వెంకటపతి రాజు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కనుమూరి సాంబమూర్తి రాజు, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానెట్ సౌపాటి. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఊరును తాకట్టు పెట్టిన ముద్దాయికి రిమాండ్

**- 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు -**

పుల్లలచెరువు, మేజర్‌న్యూస్: గత వైకాపా ప్రభుత్వ పాలనలో ఊరినే మింగేశాడు ఒక భూబకాసురుడు. పుల్లలచెరువు మండలంలో సిద్దినపాలెం గ్రామానికి చెందిన గడ్డం సుబ్బయ్య, కొల్లి వీరబ్రహ్మయ్య ఇద్దరు కలసి ఊరినే వారి పేర్లు మీదకు రెవెన్యూ అధికారులు సహకారంతో ఆన్లైన్‌లో ఎక్కించుకుని ఏకంగా ఊరినే తాకట్టు పెట్టారు. యర్రగొండపాలెం సహకార సంఘం బ్యాంక్ నుంచి  లక్షలు రూపాయలు రుణం పొందారు. ఈ విషయం తెలిసి మాగులూరి లక్ష్మమ్మ ప్రశ్నించిగా వారిపై బెదిరింపులకు దిగారని విసిగి వేసారిన ఆమె పోలీస్ లకు ఫిర్యాదు చేసిందని ఎస్సై సంపత్ కుమార్ తెలిపారు. ఆ గ్రామంలోని సర్వేనంబర్ 296లో ఉన్న 8.32 సెంట్ల భూమిని తన పేరుపై ఆన్లైన్ చేయించుకున్నారన్నారు. అనంతరం సహకార సంఘంలో తాకట్టు పెట్టి లక్షలు రుణం పొందారని గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారని శుక్రవారం గడ్డం సుబ్బయ్య పై కేసు నమోదు చేసి మార్కాపురం కోర్ట్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా ముద్దాయి గడ్డం సుబ్బయ్యకు 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్సై సంపత్ కుమార్ తెలియజేశారు.

## ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు



కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం గణపవరం రోడ్డులోని తెలగపాలెం రామాలయం వద్ద భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు.24 గంటల పాటు హరే రామ హరే కృష్ణ ఏక నామ సంకీర్తన చేశారు.తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప్పె నరసింహారావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు చిలకల సురేంద్ర, చందు రాంబాబు, సోమన సాయి,శ్రీనివాసరావు, అడపాల కొండయ్య, రాజ్యలక్ష్మి, ఆకుల లక్ష్మి,లక్ష్మి నాంచారమ్మ,  బుల్లిరామయ్య పాల్గొన్నారు.

## దూదేకుల నూర్‌బాషా కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలి



మార్కాపురం, మేజర్‌న్యూస్: కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలలో భాగమైన దూదేకుల నూర్ భాషా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తద్వారా రాష్ట్రంలోని దూదేకుల నూర్ బాషా కులస్తులకు అభివృద్ధిలో న్యాయం జరిగేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ బాబులు సత్వరమే దూదేకుల నూర్‌బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర టిఎన్టియుసి కార్యదర్శి, రాష్ట్ర దూదేకుల నూర్‌బాషా సంఘం ఉపాధ్యక్షులు దూదేకుల మస్తానయ్య తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా మస్తానయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలో అంతర్భాగమైన దూదేకుల నూర్‌బాషా కులస్తులమైన మాకు అన్ని అవకాశాలు కోల్పోతూ వస్తున్నామని తద్వారా అభివృద్ధికి నోచుకోక చిన్నచూపు చూడబడుతూ వస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు రాష్ట్రంలో సుమారు 20 లక్షల దాటి దూదేకుల నూర్ భాషా కులస్తులు జనాభా ఉందని అందుకు అనుగుణంగా ముస్లిం మైనార్టీలతో సమానంగా ప్రభుత్వ పథకాలు మైనార్టీ కార్పొరేషన్ రుణాలతో పాటు తదితర అన్ని అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నామినేటెడ్ పదవులలో, ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ పదవులలో జరుగుతున్న అన్యాయమును సారి చేసి దూదేకుల నూర్‌బాషా కులస్తులకు సమాన పదవులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో దూదేకుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## వడ్డెర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలి



త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: శ్రామిక వర్గానికి చెందిన వడ్డెరలు నిత్యం చెరువులు కుంటలు కాలువలు రహదారులు మరమ్మతులు చేసే కూలీలని ఇలాంటి వడ్డెర సామాజిక వర్గానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకునేందుకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించాలని జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షులు తిరుపతి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. స్థాయి అభివృద్ధి పనులలో సామాజిక వర్గం మరమ్మతు పనులు చేయాలంటే ప్రభుత్వానికి చెల్లించే డిపాజిట్లు లేకుండా ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని గ్రామీణ అభివృద్ధికి నిత్యం శ్రామిక వర్గమైన వడ్డెరలు కీలక పాత్ర పోషిస్తారని అందుకోసం బీసీ కార్పొరేషన్ ద్వారా కూడా బ్యాంకు నుండి సబ్సిడీ సంబంధమైన రుణ సదుపాయం కల్పించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు శ్రామిక వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆలోచించి కార్పొరేషన్ల ప్రత్యేకంగా ఆర్థిక రుణ సదుపాయం కల్పించాలని అదేవిధంగా వడ్డెరలకు విద్య ఉద్యోగ ఉపాధి కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర్లకు న్యాయం చేకూర్చాలని శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## బెంగుళూరులో డాక్టర్ ఉగ్ర జన్మదిన వేడుకలు



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం బెంగుళూరు నగరంలోని యెలహంక ప్రాంతంలో మాజీ ఎంపిపి తోడేటిపెదఅల్లూరయ్య, జిల్లాగొర్రెల పెంపకందారుల సొసైటీ చైర్మన్ తోడేటిగోపి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు సమకూర్చిన కేకును నాయకులు అభిమానుల హర్షధ్వానాల మధ్య కేక్ కటింగ్ చేసి ఒకరికొకరు పంచుకుని ఆనందంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి ప్రజాసంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి భవిష్యత్తులో ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటూ ఎమ్మెల్యే ఉగ్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మాజీఎంపిపి టి.పి.అల్లూరయ్య, షీప్ సొసైటీ చైర్మన్ తోడేటి గోపి, పారిశ్రామికవేత్త, సీనియర్ టిడిపి నాయకులు జి.వి.శ్రీనివాసవర్మ, మాజీ వైస్ ఎంపిపి బొబ్బూరి రమేష్, భైరవకోన మాజీచైర్మన్ జి.వెంకటరామరాజు, ఎన్.ప్రసాద్, అభిమానులు, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించరాదు: సిఐ



టంగుటూరు, మేజర్‌న్యూస్: ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని సింగరాయకొండ సిఐ సిహెచ్ హజరత్తయ్య ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. టంగుటూరు సమీపములోని టోల్ ప్లాజా వద్ద శనివారం రాత్రి ఆటోలలో అధిక ప్రయాణికులతో ఎక్కించుకొని వెళుతున్న ఆటోలను నిలిపివేసి ఆటో డ్రైవర్లకు, ప్రయాణికులకు సిఐ హాజరత్తయ్య కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తమ ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని తెలిపారు. ఒకవేళ ఎవరైనా పరిమితికి మించి అధిక ప్రయాణికులను ఎక్కించుకుంటే అలాంటి ఆటో డ్రైవర్ల పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు విధిగా తమ డ్రైవింగ్ లైసెన్స్, బండికి ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ప్రయాణికులు తమ ప్రయాణించే ఆటోలలో క్షేమంగా గమ్యాన్ని చేరుకొనుటకు పరిమితి గల ఆటోలోని ప్రయాణించాలని ప్రయాణికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వి.నాగమల్లేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మోటార్ సైకిల్‌ను ఢీకొన్న కారు ఒకరి మృతి



సింగరాయకొండ, మేజర్‌న్యూస్: మోటార్ సైకిల్ పై ప్రయాణిస్తున్న వ్యక్తిని వెనక నుండి కారు ఢీకొట్టడంతో మోటార్ సైకిల్ పై ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం జాతీయ రహదారిపై కనుమల్ల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జరుగుమల్లి మండలం వావిలేటుపాడు గ్రామానికి చెందిన మిడసల మాల్యాద్రి అనే వ్యక్తి వ్యక్తిగత పనులపై కావలి వైపు వెళుతుండగా సింగరాయకొండ పరిధిలోని కనుమల్ల జాతీయ రహదారిపై గుంటూరుకు చెందిన కారు వెనక నుండి ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ పై ప్రయాణిస్తున్న మాల్యాద్రి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సింగరాయకొండ ఎస్సై బి.మహేంద్ర సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం 108 సహాయంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఘనంగా ఉగ్ర నరసింహారెడ్డి జన్మదిన వేడుకలు

వెలిగండ్ల, మేజర్‌న్యూస్: స్థానిక మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డా.ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం నియోజకవర్గ రైతు అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, మండల రైతు అధ్యక్షులు మీనిగా కాశయ్య అన్ని గ్రామాల టీడీపీ పార్టీ అధ్యక్షులు సంబంధిత కార్యకర్తలు మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గొలుసు దుకాణాలపై ఉక్కుపాదం మోపాలి

**- జిల్లా ఎక్సైజ్ అధికారి దేవదత్.**



వేమూరు(భట్టిప్రోలు)మేజర్ న్యూస్: అనధికార గొలుసు దుకాణాల నిర్వహణ దారులపై ఉక్కు పాదం మోపాలని జిల్లా ఎక్సైజ్ అధికారి జి దేవదత్ తెలియజేశారు. శనివారం వేమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చావలి మద్యందుకాన్ని తినిఖీ చేశారు. ప్రజలనుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు గొలుసు దుకాణాలపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటున్నామని దుకాణదారులను హెచ్చరించారు.అనంతరం వేమూరు ఎక్సైజ్ కార్యాల యంను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతోపాటు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపర్డెంట్ బి వెంకటేశ్వర్లు,సీఐ ఏ రవి,ఎస్సై శ్రీకాంత్,సిబ్బంది ఉన్నారు.

## పట్టణంలో పోలీసింగ్



కంభం, మేజర్‌న్యూస్: పట్టణంలో పోలీసులు పోలీసింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్టీసి బస్టాండ్, చౌక్ సెంటర్‌లలో రహదారులను ఆక్రమించి ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తున్న పండ్ల వ్యాపారుల బండ్లను చిరు వ్యాపారులను తొలగించారు. చాలారోజులుగా రహదారులకు ఇరువైపులా తోపుడు బండ్లు పెట్టుకొని జీవనం సాగిస్తున్న చిరువ్యాపారుల వలన ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలుగుతున్నందున రోడ్లకు ఇరువైపులా ఇలా తోపుడు బండ్లు పెట్టుకోవడం వలన ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని పండ్ల వ్యాపారులకు పోలీసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఇంటూరిని సత్కరించిన ఆర్యవైశ్య కమిటీ సభ్యులు



ఉలవపాడు, మేజర్‌న్యూస్: మండల ఆర్య వైశ్య అధ్యక్షులుగా బాపనపల్లి సుబ్రహ్మణ్యం ఎన్నికైన సందర్భంగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావును ఆర్యవైశ్య కమిటీ సభ్యులు మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మర్యాదపూర్వకంగా శనివారం కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య అధ్యక్ష కార్యదర్శులు బాపనపల్లి సుబ్రహ్మణ్యం, పొన్నూరు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు బి.సురేష్ కుమార్, ఉప కార్యదర్శి దివ్యనందగుప్త, కోశాధికారి మేడ అర్జున్, ఉప కోశాధికారి వాగిచర్ల రాఘ వేంద్ర కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే అన్నాను కలసిన జిల్లా వైసిపి ఆర్గనైజేషనల్ కార్యదర్శి శిరుగూరి



కొనకనమిట్ల, మేజర్‌న్యూస్: వైసీపీ జిల్లా ఆర్గనైజేషనల్ కార్యదర్శిగా నియమితులైన చిరుగూరి కోటేశ్వరరావు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త అన్నా వెంకట రాంబాబును శనివారం మార్కాపురంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మురళి కృష్ణ, వైసీపీ మండల కన్వీనర్ మోరా శంకరరెడ్డి, సోషల్ మీడియా కో కన్వీనర్ కోటపాటి బ్రహ్మారెడ్డి, మార్కాపురం నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఏలూరి సంజీవరెడ్డి, గనివాని పాడు గ్రామ సర్పంచ్ పాలూరి లక్ష్మి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ పాలూరి వెంకటనారాయణ, నాయకులు పాలూరి కాశయ్య, పాలూరి వెంకటసుబ్బయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు బంకు కాశీం తదితరులు నాయకులు పాలుగొన్నారు.

## పోలీస్ సిబ్బందికి యోగా క్లాసులు



కొండేపి, మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఉత్తర్వుల మేరకు కనిగిరి ఎస్డిపిఓ సూచనలతో శనివారం కొండేపి సర్కిల్ పరిధిలోని కొండేపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాల పోలీస్ సిబ్బందితో యోగా క్లాసులు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఖచ్చితంగా ఆరోగ్య నియమాలు పాటించాలని ప్రతి ఒక్కరు విధిగా వ్యాయామం చేయాలని తెలియజేశారు. మీ కుటుంబ సభ్యులతో పాటు మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొండేపి ఎస్సై ప్రేమ్ కుమార్, అనుక్, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉగ్ర జన్మదిన వేడుకలు అనాధ ఆశ్రమంలో అన్నదానం



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: కనిగిరి శాసన సభ్యులు, నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత, నిత్య ప్రజాసేవకుడు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి జన్మదిన వేడుకల ను శనివారం మండల టిడిపి యువనేత, సి.ఎస్. పురం పంచాయతీ వార్డు మెంబర్ మన్నేపల్లికార్తీక్ నాయుడు అధ్వర్యంలో బెంగుళూరు లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అనాధ పిల్లల ఆశ్రమంలో నాయకులు అభిమానులు ఎమ్మెల్యే ఉగ్ర పుట్టినరోజు కేక్ కటింగ్ చేశారు. అనంతరం ఒకరికొకరు పంచుకుని పిల్లలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని అనాధపిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో మరింతగా నియోజకవర్గ అభివృద్ధి ప్రజలకు సేవలు అందించాలని జన్మదిన శుభా కాంక్షలు తెలుపుతున్నట్లు అన్నారు. కార్యక్రమంలో యువనేత మన్నేపల్లి కార్తీక్, నాయకులు సమ్మన రమణయ్య, టి.వి.రమణారెడ్డి, మన్నేపల్లి సాయి, సురేంద్ర, కొండయ్య, పాడే బాలు, పలువురు టిడిపి కూటమి అభిమానులు, ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

**25 ఏళ్ళ క్రితం మొక్కలు నాటి సంరక్షించిన ఆర్టీసీ మేస్త్రీలకు ఘన సన్మానం**

**వృక్షమిత్ర రాష్ట్ర ఫౌండర్, రిటైర్డ్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగవేంద్రరావు**



చీమకుర్తి, మేజర్‌న్యూస్: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు, పర్యావరణాన్ని రక్షిస్తే మన భవిష్యత్తు, మానవ మనుగడ కోసం పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదాం అంటూ... వృక్షో రక్షిత రక్షితః... మానవ మనుగడకు, సర్వ జీవుల సుఖ జీవనానికి వృక్ష సంపదను రక్షించుకుందామని వృక్ష మిత్ర రాష్ట్ర ఫౌండర్, రిటైర్డ్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వి. నాగ వేంద్రరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్.టి.సి.,బస్టాండు లో గత 25 సంవత్సరాల నాడు మొక్కలు నాటి, వాటిని సంరక్షించిన ఆనాటి రీజినల్ మేనేజర్ ఎం. వి.నాగ వేంద్రరావు శనివారం చీమకుర్తి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న ఆచెట్టును చూసి, వాటిని సంరంక్షించిన ఆర్టీసీ మేస్త్రి లను, చనిపోయిన కంట్రోలర్ మిలటరీ మాబు కుమారుడు షేక్ ఛాంద్ బాష, ఆర్టీసీ మేస్త్రీలు చింతగింజల సుబ్బరావు, ఎనిమిరెడ్డి, ఎరుకల రెడ్డిలను ఘనంగా సత్కరించి బహుమతులు అందజేశారు. తొలిత ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మెక్కలను వృక్ష మిత్ర రాష్ట్ర ఫౌండర్, రిటైర్డ్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వి. నాగవేంద్రరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ బి జవహర్ మొక్కలు నాటారు. వాటి సంరక్షణను అక్కడి షాపుల యజమని, కార్గో నిర్వాహకుని కి అప్ప చెప్పారు. ఈ కార్యక్రమానికి రీజినల్ మేనేజర్ బి.సంధాకర్ అద్యక్షత వహించారు. ముఖ్యఅతిథి హాజరైన వృక్షమిత్ర రాష్ట్ర ఫౌండర్, రిటైర్డ్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వి.నాగవేంద్రరావు మాట్లా డుతూ మొక్కలు నాటి 25సంవత్సరాలు పాటు, మొక్కలను సంరక్షించిన ఆర్టీసీ మేస్త్రిలను ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు, కనిగిరి డిపో మేనేజర్ షయనా బేగం, పొదిలి,ఒంగోలు, అసిస్టెంట్ మేనేజర్ ధనలక్ష్మి, చిన్నయ్య సూరి, వృక్ష మిత్ర నిర్వాహకులు కె సుబ్బారెడ్డి, కంట్రోలర్ పరాంకుశ శ్రీనివాసమూర్తి, ముఖర్జీ, ఎస్.కె.ఆర్ ప్రిన్సిపాల్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ గెలుపుతో సంబరాలు చేసుకున్న భాజపా



కందుకూరు, మేజర్‌న్యూస్: ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ అఖండ విజయం సాధించడంపట్ల కందుకూరు బాజపా నాయకులు బాణ సంచాకాల్చి సంబరాలు జరుపుకున్నారు. పట్టణ శాఖ కార్యాలయం నుంచి తపాల శాఖ కూడలి వరకు ప్రదర్శన నిర్వహించారు. రానున్న రోజులలో దేశంలో బాజపా తిరుగులేని విజయాలను సాధిస్తూ ప్రధాని నరేంద్రమోడీ జాతీయ అధ్యక్షులు జె.పి.నడ్డా నాయకత్వంలో ముందుకు పోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జొన్నాదుల రాఘవయ్య అసెంబ్లీ కన్వీనర్ గట్టమనేని హరిబాబు పట్టణశాఖ అధ్యక్షులు మన్నేపల్లి వరప్రసాద రావు రూరల్ మండల అధ్యక్షులు చల్లా వెంకటరాజ ప్రధాన కార్యదర్శి చుండి మురళీధర్ కార్యదర్శి గొడ్డటి బాలరాఘవ యాదవ్ ఉపాధ్యక్షులు బొర్రా కోటేశ్వర రావు అమలనాధుని మాల్యాద్రి నాయుడు జిల్లా యస్.సి. మోర్చా నాయకులు జి. మోజెస్ ఓబీసీ మోర్చా పట్టణ శాఖ అధ్యక్షులు మాటూరి రమేష్ నాయుడు వి హెచ్‌పి నాయకులు వలెటి కొండపనాయుడు సీనియర్ నాయకులు చిన్ని పాండురంగయ్య పాల్గొన్నారు.

# రాష్ట్ర క్రీడల్లో కదిరి బాబురావు కళాశాల విద్యార్థుల ప్రతిభ




సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: డాక్టర్ వైయస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం అధ్వర్యంలో అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు అనంత రాజుపేట ఉద్యాన కళాశా లలో జరిగిన రాష్ట్రస్థాయి అంతర కళాశాలల క్రీడాపోటీల్లో కదిరి బాబురావు ఉద్యాన కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు లక్ష్మీహారిక లాంగ్‌జంప్, హైజంప్‌లో మొదటిస్థానం, విష్ణు 100మీటర్స్ రన్నింగులో రెండవస్థానం, లాంగ్‌జంప్‌లో మూడవ స్థానం, చరణ్ తేజ 200మీటర్సు రన్నింగులో ద్వితీయ స్థానం, పవన్‌కుమార్ హైజంప్‌లో మూడవస్థానం, ఆదిలక్ష్మి క్లేమోడ లింగ్‌లో మూడవస్థానం సాధిం చారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి జరిగిన డాక్టర్ వైయస్ఆర్ విశ్వ విద్యాలయం ఉపకుల పతి డాక్టర్ బి.గోపాల్, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సూర్య కుమారి విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈసందర్భంగా కదిరిబాబురావు విద్యా సంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి, కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్, అధ్యాపక సిబ్బంది విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించి విద్య, క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సుస్మిత,పిఇటిలు బి.రవీంద్ర బాబు, బి.మౌనిక, పలువురు పాల్గొన్నారు.

# అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలి

**ఎమ్మెల్యే కందులను కోరిన పొదిలి పట్టణ అధ్యక్షులు కుద్దూస్**



పొదిలి, మేజర్‌న్యూస్: పొదిలిలో అపరిస్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని మార్కాపురంలో శనివారం జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి పట్టణ టిడిపి అధ్యక్షులు ముల్లా కుద్దూస్ విన్నవించుకున్నారు. ముఖ్యంగా త్రాగునీటి సమస్య, కరెంటు,రోడ్లు సమస్యలపై ప్రజాదర్బార్‌లో శాసనసభ్యులకు వివరించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. వెంటనే సానుకూలంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్పందించారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీరితో పాటు నాయకులు, ముల్లా ఖయ్యూం, పట్టణ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఢిల్లీ ఎన్నికల్లో కమల వికాసంపై సంబరాలు

గిద్దలూరు, మేజర్‌న్యూస్: ఢిల్లీ ఎన్నికలలో బీజేపీ 27 సం.ల తరువాత ఘన విజయం సాధించిన సంధర్భంగా జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసులు, మాజీ జిల్లా అధ్యక్షులు పివి శివారెడ్డితో కలసి గిద్దలూరు పట్టణంలో భారతీయ జనతా పార్టీ నాయకులు టపాసులు స్వీట్స్ పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమం గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అపిసెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జెవి నారాయణ, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు, రాష్ట్ర కిసాన్ మోర్చ కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్ రెడ్డి, జిల్లా ఏస్సి మోర్చ ప్రధాన కార్యదర్శి మట్టేమల్ల పుల్లయ్య, జిల్లా కార్యదర్శి రాజశేఖర్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ ఖాదర్ వలీ షఫీ, యువ నాయకులు కె.కృష్ణ, జిల్లా ఒబిసి ప్రధాన కార్యదర్శి బాదుల్లా, ఒబిసీ నాయకులు కొప్పుల నరసింహులు, సీనియర్ నాయకులు కె.చంద్ర మోహన్, సీనియర్ నాయకులు కాసులు, సీనియర్ నాయకులు బాదం మనోహర్, సీనియర్ నాయకులు పళ్ళెం శ్రీనివాసులు, పట్టణ ఉపాధ్యక్షులు కొప్పరపు నాగేశ్వరరావు, పట్టణ బీజేవైఎం అధ్యక్షులు ఎ.సాయి చరణ్, బీజేవైఎం ఉపాధ్యక్షులు సంతోష్, రూరల్ మండల అధ్యక్షులు కె.తిరుపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు దప్పిలి వినోద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. జిల్లా బీజేపీ అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసులు నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ రాబోయే రోజులలో ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ బలమైన పార్టీగా రూపొందడానికి ప్రతి నాయకుడు కృషి చేయాలని కోరారు.

## బిజెపి విజయంపై హర్షం వ్యక్తం చేసిన అధికార ప్రతినిధి విజయలక్ష్మి



పొదిలి,మేజర్‌న్యూస్: దేశ రాజధాని ఢిల్లీలో బిజెపి విజయం పట్ల జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయ లక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన ఎన్నికల లెక్కింపులో ఎక్కువ స్థానాల్లోబిజెపి విజయం సాధించటం ప్రజల ఆశీస్సులే అన్నారు. ప్రధాని మోడీ సారథ్యంలో 23 సంవత్సరాల తర్వాత బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని, శరీరానికి గుండె ఎలాంటిదో దేశానికి రాజధాని కూడా అలాంటిది అని పేర్కొన్నారు. ఎర్రకోటపై జాతీయ జెండా ఎలా రెపరెపలాడు తుందో, అదేవిధంగా ఢిల్లీ కోటపై బిజెపి జెండా ఎగరటం ఆనందదాయకమన్నారు. మాజి సీఎం క్రేజీ వాల్ మాయమాటలను అక్కడ ప్రజలు నమ్మలేదని, వారు బిజెపికి ఓటు వేయడం ప్రజాస్వామ్యాన్ని స్వాగ తించటమే అన్నారు.

## ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేత



దర్శి, మేజర్‌న్యూస్: మండలంలోని తూర్పు చౌటపాలెం వాస్తవ్యులు కాలే మోక్షితశ్రీ పుట్టినరోజు సందర్భంగా దర్శి కురిచేడు రోడ్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా వృద్ధాశ్రమంలో వృద్ధులకు 50 కేజీల బియ్యం, పండ్లు, మిఠాయిలు అందచేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం వెంకటరావు, కాలే సుకన్య దంపతులు, తేజశ్రీ, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

# సౌర విద్యుత్ వినియోగం పెరగాలి

## ట్రూజన్ సోలార్ ఎనర్జీ సిస్టమ్స్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల



ఒంగోలు, మేజర్‌న్యూస్ : సౌర విద్యుత్ దిశగా ప్రజలు అందరూ ముందుకు అడుగులు వేయాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు సూచించారు. నగరం లోని 15వ డివిజన్ పరిధిలో అన్నవ రప్పాడు 2వ లైన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రూజన్ సోలార్ ఎనర్జీ సిస్టమ్స్ జిల్లా కార్యాలయాన్ని ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. ట్రూజన్ సోలార్ ఎనర్జీ సిస్టమ్ ఏండి అనిల్, జిల్లా డీలర్ బలరామ్‌లు దామచర్లకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ సన్ టెక్ కంపెనీకి చెందిన ట్రూజన్ సోలార్ ఎనర్జీ సిస్టమ్స్ కార్యాలయాన్ని ఒంగోలులో ఏర్పాటు చేయడం అభినందనీయం అని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ భారం అధికంగా ఉండడం వల్ల ప్రజలు సౌర విద్యుత్‌పై దృష్టి సారిస్తున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సౌర విద్యుత్ దిశగా ముందుకు వెళుతున్నాయి అని అన్నారు. 78 వేల రాయితీతో ప్రభుత్వం ఈ పథకాన్ని అందిస్తున్నాయి అని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సంస్థ ఏండి 2 లక్షల మంది ఖాతాదారులకు కలిగిన సంస్థ ట్రుజన్ అని అన్నారు. ప్రత్యేక యాప్ ద్వారా సోలార్ ఎనర్జీ సిస్టమ్‌ను నిరంతరం పర్య వేక్షణ చేసుకునే సదుపాయాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో స్థానిక కార్పొరేటర్ చింతపల్లి గోపి, నరసింహ పాల్గొన్నారు.



# అలరించిన సినీ సంగీత విభావరి

ఒంగోలు, మేజర్‌న్యూస్: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఒంగోలు వారి ఆధ్వర్యంలో ప్రతినెల రెండవ శనివారం జరిగే సాంస్కృతిక కార్యక్రమాలలో 92వ కార్యక్రమాలు నేడు ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మయూరి ఆర్కెస్ట్రా, ఈవెంట్స్ ఒంగోలు వారి ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. బోర్డు ఆర్టిస్ట్ ఇర్మియ ఆధ్వర్యంలో జరిగిన ఈ సినీ సంగీత విభావరిలో గాయనీ గాయకులుగా రాజేష్, శైలజ, యశోద, హరిబాబు, సాగర్, అశోక్, ఉషారాణి, రాఘవయ్య తదితరులు ఆలపించినటువంటి గీతాలు శ్రోతలను మంత్రముగ్ధులను చేశాయి. అలాగే ఆనవాయితీగా చేస్తున్నటువంటి కార్యక్రమం ఈనెలలో మరణించిన రంగస్థలం ప్రముఖులు ఘంటసాల వెంకటేశ్వరరావు, ఈలపాట రఘురామయ్య, షణ్ముఖి ఆంజనేయరాజు, షేక్ నాజర్ వర్ధంతులు, జిల్లా అవతరణ దినోత్సవం గురించి చిట్టా వెంకట శివప్రసాద్, కనుమల రాఘవులు, ధేనువకొండ సుబ్బయ్య తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమ నిర్వాహకులుగా జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, సభ్యులు నరేంద్ర, రంగారావు తదితరులు వ్యవహరించారు.

# ఢిల్లీ గడ్డపై బిజెపి విజయంపై ఒంగోలులో సంబరాలు

ఒంగోలు, మేజర్‌న్యూస్: 27 సంవత్సరాలు తర్వాత ఢిల్లీ గడ్డపై బిజెపి జెండా రెపరెపలాడిందని భారతీయ జనతా పార్టీ ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్ అన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి ఘన విజయంపై యోగయ్య ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. స్థానిక చర్చీ సెంటర్ వద్ద బాణా సంచా కాలుస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాకినేని అమరసింహ, రాయపాటి అజయ్ కుమార్, శివాజీ యాదవ్, బి.విజయరావు, శ్రీలక్ష్మి, మోజేస్, సీతారామయ్య, కాటా రాధాకృష్ణమూర్తి, బొద్దులూరి ఆంజనేయులు, నాగేంద్రయాదవ్, దామోదర్, అనిల్, కటారి సుధాకర్, తిరుమల శెట్టి శ్రీరాములు, కోలా వాసుబాబు, డాక్టర్ కొమ్మి నరసింహారావు, సంజీవ్‌కుమార్, పి.మధు యాదవ్, కె.రవియాదవ్, గుర్రం రంగనాథ్, గుర్రం సత్యనారాయణ, శివ శ్రీనివాసరావు, సురేష్, విజయ్, మోడీ, బి.తిరుమలపెట్లూరి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు అందించడమే మా లక్ష్యం

## - సన్‌రైజ్ ఆగ్రో సీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ నూతన వ్యవసాయ ప్రొడక్ట్ ఆవిష్కరణ -



ఒంగోలు, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాములో సన్ రైస్ అగ్రో సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవసాయ ఉత్పత్తులను శనివారం జిల్లా కేంద్రంలో ఒంగోలులో ఆవిష్కరించారు. సుమారు తొమ్మిది రకాల ఆగ్రో ప్రొడక్ట్స్ ను రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ సందర్భంగా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఏ శివ నాగిరెడ్డి మాట్లాడుతూ ఈ నూతన వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా ఆంధ్రప్రదేశ్లోని రైతులకు అధిక దిగుబడులు మరియు అనుకుల పరిస్థి తులు కూడా ఎదుర్కొని రైతులకు పూర్తిస్థాయి పంటలు చేతికి వచ్చేలా ఈ వ్యవసాయ ఉత్పత్తులను రూపొందించినట్లు క్లినికల్ ట్రైల్స్‌లో 100 శాతం ఫలితాలు వచ్చిన తర్వాతే మార్కెట్లకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. సన్ రైజ్ అగ్రో సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు మాట్లా డుతూ ప్రస్తుతం మేము తీసుకొస్తున్న ఈ తొమ్మిది రకాల ప్రొడక్ట్ రైతులకు ప్రస్తుతం అడ్వాన్స్ టెక్నాలజీతో పాటు భూమి సారంతో ముడిపడి వారి పంట పొలాలలో సాగు చేసే పంటలను అధిక దిగుబడిలో వచ్చేలా తయారు చేశామని తెలిపారు. కంపెనీ డైరెక్టర్ డాక్టర్ ఎస్. పురుషోత్తం మాట్లాడుతూ ప్రస్తుతం విదేశాల్లో ఇప్పటికే నూతన వంగడాలు ఈ ప్రొడక్ట్స్ ద్వారా అక్కడ పంటల అభివృద్ధి చెందాయని మార్కెట్లోకి తీసుకు వస్తున్న ఈ ప్రొడక్ట్ నుండి ఆంధ్రప్రదేశ్ రైతులకు వారి పండించే పంటలన్నీ మంచి ఉత్పాదనలతో అధిక దిగుబడి వచ్చేలా ఉపయోగపడతాయని తెలిపారు. ప్రధానంగా సన్రైజ్ ఆగ్రో సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుండి రాయల్ సామ్రాట్, సూపర్ స్టార్ట్ 1.-2.-3 త్రిశూలం, గ్రోమిన్ స్పెషల్ సన్ రైస్ బూస్టర్, గ్రో ఫ్లవర్, రాయల్ స్వర్ణ గోల్డ్ లాంటి ప్రొడక్ట్స్‌ను నేడు మార్కెట్లో లాంచ్ చేసినట్లు తెలిపారు. ఇందులో రాయల్ స్వర్ణ గోల్డ్ ఈ ప్రొడక్ట్ ద్వారా బెంగాలీ గ్రామ్, పొగాకు కూరగాయల పంటలకు వాటిల్లే అన్ని రకాల పురుగులును అరికట్టటానికి మరియు ఫైరు ఎదుగుదలకు బాగా ఉప యోగపడుతుందని తెలిపారు. డైరెక్టర్ రామకృష్ణ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో బిజెపి విజయంపై ఖలీఫాతుల్లా భాషా హర్షం



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఇరువై ఏడు ఏళ్ళ తర్వాత ఢిల్లీ ప్రజలు బిజెపికి గొప్ప విజయాన్ని అందించారని భారతీయ జనతా మాజ్దూర్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖలీఫా తుల్లా బాషా హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీ బిజెపికి డబుల్ ఇంజన్ సర్కార్ కోసం అవకాశాన్ని ఇచ్చిన ఢిల్లీ ప్రజలకు ఏపీ బిజెపి తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ పరంపరతో త్వరలో బీహార్‌లో కూడా గెలుస్తామని ధీమాను వ్యక్తం చేశారు. బిజెపితో పాటు టిడిపి, జనసేన నేతలు ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో నేరుగా పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, మద్దతు ఇచ్చిన పవన్ కళ్యాణ్‌కి ధన్యవాదాలు తెలిపారు.

# ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌ను ఎమ్మెల్యే ఇంటూరి తనిఖీ




ఉలవపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని కరే డు పంచాయతీలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్‌ను నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే హాస్టల్లో సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందే విధంగా చూడాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. హాస్టల్లో ఏ మైనా సమస్యలు ఉంటే విద్యార్థులు ఎప్పుడైనా తనను ఫోన్లో ఫిర్యాదు చేయవచ్చని, వారికి మొబైల్ నెంబర్‌ను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.






# ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు

మొదటి పేజీ తరువాయి అన్నారు. గ్రామాల్లో సిసి రోడ్లు మంజూరు చేయించామన్నా రు. అర్హత ఉండి ఎవరికైనా ప్రభుత్వ పథకాలను పొందలేని వితంతు, వృద్ధులు, ఇండ్ల స్థలాలు, మరి ఏ ఇతర స్థానిక సమస్యలు ఉన్నప్పటికీ లబ్ధిదారులు ఈ ప్రజా దర్బార్ వేదిక నందు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన అన్నారు. ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ అజెండాగా పని చేస్తున్నామని, ఇందుకు ఎటువంటి ఆర్థిక పర మైన సమస్యలు ఉన్నప్పటికీ వాటిని అధిగమించి అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన అన్నారు. ప్రజా దర్బార్ వేదికలో దొర్నాల మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు, డ్రైవర్లు, కలిసి ఇళ్ల స్థలాలు మంజూరు కోసం అర్జీ ఇవ్వడం జరిగింది. గతంలో ఇచ్చిన మాట ప్రకారం నాకు గుర్తుంది. డ్రైవర్ల అందరికీ ఇళ్ళ స్థలాలు, బిల్డింగులు మం జూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇళ్ల స్థలాలు, పిన్షన్లు, రెవిన్యూ, పంచాయతీ సమస్యలు 285 అర్జీలు అధికంగా వచ్చాయి. వాటిని వారం రోజు వ్యవధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయా లని అధికారులను సంబంధిత శాఖ అధికారు లకు అందజేసి తక్షణం వాటిని పరిష్కరించవల సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ చిత్తూరి హరిక, ఎంపీడీవో ఎం. నాసర్ రెడ్డి, తాహసిల్దార్ కెన్నెర శాంతి, విద్యాశాఖ అధికారి బి. మస్తాన్ నాయక్, వెలుగు ఏపీఎం దర్శనం పోలయ్య, ఆర్డబ్ల్యూఎస్ డి.ఈ. ఎం. శ్రీనివాసులు, ఏఈ భ్రమరాంబ దేవి, హౌసింగ్ ఏఈ బెల్లం శివశంకర్, వ్యవసాయ శాఖ అధికారి జవహర్ నాయక్, మేజర్ పంచాయతీ సెక్రెటరీ శివ కోటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు తెలుగుదేశం మండల ఏరువా మల్లికార్జున్ రెడ్డి, జనసేన మండల కేతి వెంకట మురళి, మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ మాబు, వల్లపునేని కాశయ్య, బట్టు సుధాకర్ రెడ్డి, దొడ్డ శేషాద్రి, చంటి, ఈదర మల్లయ్య, కొప్పుల సుబ్బారెడ్డి, వెంగల్ రెడ్డి, దేవయ్య, జంగిల్ పిచ్చయ్య, శేఖర్ బాబు, రామకృష్ణ పాల్గొన్నారు.



## గుడి ఆవరణలో మొక్కలు నాటిన భక్తులు



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణంలోని తూర్పు సత్రం యాదవ పాలెం లో ఊరిబిండి వారి శ్రీ ఎల్లమ్మ తల్లి గుడి దగ్గర వేప చెట్టును రాగి చెట్టును యాదవ పాలెం గ్రామస్తులు అందరు కలసి గుడి ఆవరణలో మొక్కలను నాటారు.గుడి పూజారి గ్రామ పెద్దలు ఉరిబిండి సాంబశివరావు, శ్రీనివాసరావు, సూర్యనారాయణ, గోపి, గోపీనాథ్, గోపిరాజు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు అంబేద్కర్ చిత్రపటం బహుకరణ




పిట్టలవానిపాలెం మేజర్ న్యూస్: ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత భారత రత్న బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని మండేవారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు బహుకరించిన గల్లా రమేష్. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉదయ్ కుమారి, క్రీస్తు రాజు,విద్యార్థిని, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



బాపట్ల, మేజర్‌న్యూస్: హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో సేవా భారతి వారి సహకారంతో కొండుభొట్ల పాలెం శివారు యస్.టి కాలనీ (యానాది కాలనీ)లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. డాక్టర్ శ్రీనివాసులు శ్రీనివాస్ వైద్య పరీక్షలు, ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో గడ్డం రామకోటేశ్వరరావు, మండల సంయోజక్ బెజవాడ వెంకటేశ్వర్లు, నున్నా రత్తయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అద్దంకిలో భాజపా నేతలు సంబరాలు, మిఠాయిలు పంపిణీ



అద్దంకి, మేజర్‌న్యూస్:ఢిల్లీ ఎన్నికల్లో భాజపా తిరుగులేని విజయంతో పీఠాన్ని కైవశం చేసుకోవటం పట్ల అద్దంకిలో భాజపా నేతలు శనివారం సాయంత్రం సంబరాలు చేసుకున్నారు. బంగ్లారోడ్డు ఆరంభం లోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన సంబరాల్లో శ్రేణులు ఉత్సాహంగా బాణాసంచా కాల్చారు. మిఠాయిలు పంచుకున్నారు. ఆర్టిజన్ విభాగం నేత కొండముది బంగారుబాబు నేతృత్వంలో జాగర్లమూడి యల్లమందరావు, పరుచూరి శ్రీనివాసరావు, తమ్మున శ్రీనివాసరావు, కాలేషా, కొండ్రగుంట శ్రీనివాసరావు, మంగమూరి సురేష్, జవ్వాజి నాగమల్లేశ్వరరావు, ఈదా చిన్నశ్రీనివాసరెడ్డి, ఓరుగంటి అంజిరెడ్డి, సురేష్, కూరిరామకోటిరెడ్డి, నార్నె రత్తయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం



బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్, చీరాల అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ అనుసంధానముతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ శిబిరం యొక్క ముఖ్య ఉద్దేశం విద్యార్థులకు, అధ్యాపకులకు , బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులకు వైద్య సేవలను అందించి ఆరోగ్యం మీద అవగాహన కల్పించుట కొరకు నిర్వహించామని తెలిపారు. బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ యువత వివిధ రుగ్మతలకు గురి అవుతున్నారని ఆదిలోనే తెలుసుకొని విముక్తి పొందాలని తెలిపారు. అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ లోని సీనియర్ వైద్యులు డాక్టర్ రవి కిరణ్ మాట్లాడుతూ మా లక్ష్యం సమాజానికి నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను తీసుకురావటం యువకులలో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించేలా చేయడం అని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్ మాట్లాడుతూ వందలాదిమంది అధ్యాపకులు, అధ్యాపక కేతర సిబ్బంది, విద్యార్థులు వైద్య సేవల ద్వారా ప్రయోజనం పొందడంతో ఈ శిబిరానికి అద్భుతమైన స్పందన లభించిందని తెలిపారు. వైద్య సిబ్బంది బృందం సాధారణ తనిఖీలు, రక్తపోటు పర్యవేక్షణ, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ పరీక్షలు, ఎముకల దృఢ నిర్ధారణ పరీక్ష ,ఈసీజీ, వివిధ ఆరోగ్య సమస్యల కోసం సంప్రదింపులతో సహా సమగ్ర ఆరోగ్య పరీక్షలను నిర్వహించింది. ఈ కార్యక్రమమునకు నిపుణులైన వైద్య బృందం డాక్టర్ నిరూపమ ఎమ్మెస్ గైనకాలజీ, డాక్టర్ గోపి వర్మ ఎండి జనరల్ మెడిసిన్ ,డాక్టర్ రంగనాథరెడ్డి ఎమ్మెస్ ఆర్థోపెడిక్ , డాక్టర్ సజ్జన బిడిఎస్ డెంటల్ పాల్గొని శిబిరమునకు వచ్చిన అందరికీ తగిన సూచనలు ఇచ్చి ఉచిత మందుల పంపిణీ చేశారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ 1కారుమంచి వెంకట్రావు, వైస్ ప్రెసిడెంట్ 2 పారేపల్లి చంద్రశేఖర్, జాయింట్ సెక్రెటరీ దొడ్డపనేని వెంకయ్య చౌదరి, ట్రెజరర్ కోట వీర బ్రహ్మయ్య,గవర్నింగ్ బాడీ సభ్యులు,కళాశాల డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొ.డి .నిరంజన్ బాబు ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.కే రాజేంద్ర, అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఢిల్లీ గెలుపుతో బాపట్లలో సంబరాలు



బాపట్ల, మేజర్‌న్యూస్: భారతీయ జనతా పార్టీ ఢిల్లీలో ఘనవిజయం సాధించిన సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో విజయోత్సవాలు జరిపారు. జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పి, భారతీయ జనతా పార్టీకి మద్దతుగా నిలిచారన్నారు. అవినీతి, అస్తవ్యస్త పరిపాలన, తప్పుడు హామీలు, ప్రజలను మభ్యపెట్టే విధానాలను ప్రజలు తిరస్కరించారన్నారు. కేజ్రీవాల్ తన పార్టీని అవినీతి కార్యక్రమాలకు కేంద్రంగా మార్చి, పాలనను పూర్తిగా విస్మరించారన్నారు. మద్యం కుంభకోణం, విద్యా శాఖలో అవినీతి, ఆరోగ్యరంగంలో పట్టుపడిన పతనం - ఇవన్నీ ఆయన పాలనకు నిదర్శనాలన్నారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, అభివృద్ధి, పారదర్శక పాలన, దేశభక్తితో కూడిన విధానాలను ఢిల్లీ ప్రజలు మద్దతు ఇచ్చారన్నారు. భారతీయ జనతా పార్టీ మాత్రమే ఢిల్లీలో నిజమైన అభివృద్ధిని సాధించగలదనే నమ్మకంతో ప్రజలు ఈ ఎన్నికల్లో అఖండ మద్దతునిచ్చారన్నారు.ఈ విజయంతో ఢిల్లీ ప్రజలకు మంచి పాలన అందించే బాధ్యత మరింత పెరిగిందని. బీజేపీ ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బాల నారాయణ, మాజీ అధ్యక్షులు మామిడి రమేష్ కుమార్, రూరల్ మండల అధ్యక్షులు పేరి రెడ్డి, ప్రతినిధి ఆడపాల శ్రీరామయ్య్య, మువ్వల శ్రీనివాసులు, కామరాజుగడ్డ శ్రీనివాస్, తిలక్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

# మూడుముక్కలాటలో త్రిపురాంతకం మండల వైకాపా

త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని త్రిపురాంతకం మండలంలో వైసీపీ పార్టీకి గత ఐదేళ్లు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మండల ప్రాదేశిక. మండలంలోని విద్యా కమిటీ ఎన్నికల్లో అన్ని పదవులు ఏకగ్రీవం చేసి పాలన కొనసాగించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని త్రిపురాంతకం మండలం వైసీపీకే ఓటర్లు మద్దతు ఇచ్చారు. ప్రధానంగా త్రిపురాంతకం మండలంలోని 24 గ్రామపంచాయతీలోని 18 ఎం.పీ.టీ.సి స్థానాలను కైవసం చేసుకుని నాటి ఎర్రగొండపాలెం నియోజకవర్గం నుండి గెలుపొందిన డాక్టర్ ఆదిమూల సురేష్ మంత్రి స్థానాన్ని పొంది త్రిపురాంతకం మండలంలోని నాయకులతో మంచి సన్నిధి సంబంధాలు ఏర్పరచుకున్నారు. అందులో వైసీపీ అభ్యర్థి కోట్ల సుబ్బారెడ్డి మండల పరిషత్ అధ్యక్ష పదవికి రెండున్నర సంవత్సరాలు వరకే పార్టీ నాయకులతో మాట్లాడుకుని పదవి అలంకరించి ఆ తర్వాత ఒప్పందం ప్రకారం రాజీనామా చేశా రు. ఆ తర్వాత మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా ఏకగ్రీ వంగా ఎన్నికైన ఆళ్ల సుబ్బమ్మ మాజీ మండల పరిషత్ అధ్య క్షులు ఆళ్ళ ఆంజనేయ రెడ్డి సతీమణి. రెండవ మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు గొట్టిముక్కుల రిబ్కా కూడా మండల ఉపాధ్యక్షురాలుగా ఎంపికయ్యారు. మండలంలో వైసిపి పార్టీలో ఆధిపత్యం కొంత మేర విభేదాలు చోటు చేసుకున్నాయి దీంతో కోట్ల సుబ్బారెడ్డి రాజీనామా అనంతరం ఆళ్ల సుబ్బమ్మ పదవి చేపట్టాల్సి ఉండాల్సింది కాగా పార్టీలో విభేదాలు వల్ల ఉపాధ్యక్షురాలైన గొట్టుముక్కుల రిబ్కాను మండల పరిషత్ అధ్యక్షురాలుగా కొనసాగించే విధంగా ప్రభుత్వం అనుమతించింది. మండల వైసీపీ పార్టీలో రెండు వర్గాలుగా చీలిపోయిన వారు ఆంజనేయ రెడ్డికి ప్రత్యామ్నాయంగా మరొకరిని ఎంపిక చేసేందుకు ఎంపీటీసీలను ఆంజనేయ రెడ్డి కొంతమందిని ప్రత్యర్థి వర్గం కొంతమందిని కూడగట్టుకుని క్యాంపులు నిర్వహించారు. ప్రభుత్వం నుండి మండల పరిషత్ లో ఎంపీటీసీ సభ్యుల సంఖ్య ఎవరికి ఎక్కువ మంది మద్దతు ఇస్తారో దాన్నిబట్టి మండల పరిషత్ అధ్యక్షుడు పదవి కట్ట పెట్టాల్సి ఉంది అప్పటిదాకా రిబ్కా అమ్మ కొనసాగుతారు ఈలోగా ఆంజనేయ రెడ్డికి ప్రత్యర్థి వర్గం బలం పొందుకునేందుకు అధికార పార్టీ నాయకుల అండ దండలతో అధికారం పొందేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని విశ్వసనీయాల సమాచారం దీంతో 2019 నుండి 2024 సార్వత్రిక ఎన్నికల వరకు ఎదురులేకుండా గ్రామాల్లో పట్టు సాధించిన వైసీపీ పార్టీ నేడు మూడు ముక్కలాట లాగా అధికార పార్టీ అన్నదండలు అందుకొని అధికారం పొందేందుకు ప్రయత్నాలు ముమ్మరం గా కొనసాగుతున్నాయి. బొమ్మ లాటలో అధికారుల పనితీరు ఉద్యోగ బాధ్యత ఏ విధంగా ఉంటుందో వేచిచూడాల్సిందే మరి.

# ఢిల్లీ ఎన్నికలలో బిజెపి విజయం పట్ల విజయోత్సవ వేడుకలు



మార్కాపురం, మేజర్‌న్యూస్: ఢిల్లీలో మన ప్రధాన మోడీ నాయకత్వంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయ దుందుభి మోగించిన సందర్భంగా శనివారం మార్కాపురం అసెంబ్లీ నియోజక వర్గ విజయోత్సవ వేడుకలు దోర్నాల బస్టాండ్ లో కేక్ కటింగ్ చేసి చాలా ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రకాశం జిల్లా మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, ప్రస్తుత అధ్యక్షుడు అయినటువంటి సిగ్గం శ్రీనివాసరావు,అసెంబ్లీ కన్వీనర్ పీవీ కృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు పాదర్తి ఆంజనేయులు, బొంతల కృష్ణ శాసనాల సరోజినీ, మద్దెల లక్ష్మీ, సతీష్ రామకృష్ణ, వాసవి ప్రియ, బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

**విద్యుత్ శాఖ పట్టణ ఏఇ బి.సాయి శ్రీనివాస్**



బాపట్ల, మేజర్‌న్యూస్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించటమే లక్ష్యం అని విద్యుత్ శాఖ పట్టణ ఏఇ సాయి శ్రీనివాస్ తెలిపారు. శని వారం పట్టణంలోని అన్ని వార్డుల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల పనితీరుతో పాటు మరమత్తు పనులు చేపట్టారు. వార్డుల వారీగా విద్యుత్ లైన్మెన్లు, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా పనులు నిర్వహిం చారు. విజయలక్ష్మి పురం, రైలు పేట, శారదాపురి కాలనీ, మూర్తి రక్షణ నగర్, త్యాగరాయ నగర్, దగ్గు మల్లెవారి పాలెం, దర్శి పెద్ద మస్తాన్ నగర్ తో పాటు పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు తొలగింపు, ట్రాన్స్ఫార్మర్లు మరమ్మత్తుల పనులు జరిగాయి. ఎప్పటికప్పుడు ఏఇ సాయి శ్రీనివాస్ పనులను పరివేక్షిస్తూ సిబ్బందికి సూచనలు చేశారు.

## తాత్కాలిక గోశాల ఆవులకు గడ్డి, తవుడు వితరణ



బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణంలో రహదారులపై సంచరిస్తూ రోడ్డు ప్రమాదాలు కారణమవుతున్న ఆవులను బాపట్ల పురపాలక సంఘం కమిషనర్ జి రఘునాథరెడ్డి పెదనందిపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గరలో ఉన్నటువంటి హిందూ స్మశాన వాటిక ఆవరణలో తాత్కాలిక గోసంరక్షణ శాల ఏర్పాటు చేసి తరలించారు. వాటి పోషణ నిమిత్తం పట్టణంలోని గో ప్రియులు సామాజిక సేవ కోణంలో గోవులకు బాపట్ల జిల్లా ప్రెస్ క్లబ్ కార్యదర్శి బత్తుల యజ్ఞ సురేష్ ఆధ్వర్యంలో దాతలు ప్రజాహిత కన్స్ట్రక్షన్స్ అధినేత గోపాలం వెంకటేశ్వర్లు ద్వారా గోవులకు సరిపడే ఆహారాన్ని 10 ఎకరాల ఎండు గడ్డి, సుధీర్ బాబు పది బస్తాల తౌడును దానమిచ్చారు.ఈ కార్యక్రమానికి సహకరిస్తూ బాపట్ల జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివా సరావు, కొల్లూరు నాగేశ్వరరావు, హ్యూ మన్ రైట్స్ మెంబర్ వెంకట్, ఆర్యవైశ్య సంఘ నాయకుడు బొగ్గవరపు శివ, విన్నకోట శ్రీనివాసరావు, అక్కి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శివునికి అభిషేకాలు, పూజలు



కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం అగ్రహారంలోని శ్రీ గంగా గౌరీ సమేత బదరి కేదారేశ్వర స్వామి శివాలయంలో పూజారి వాసు శర్మ ఆధ్వర్యంలో బుద్దాం కో అపరేటివ్ సొసైటీ కార్యదర్శి రామచంద్రారెడ్డి వెంకాయమ్మ దంపతులు అష్టోత్తర శతనామ పూజలు, అభిషేకాలు ,పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 300 మంది స్వాములకు చద్ది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వాములు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదాలపై కూలీలకు అవగాహన



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: వ్యవసాయ కూలీలకు రోడ్డు ప్రమాదాలపై ఎస్ఐ వై.నాగరాజు అవగాహన కల్పించారు. వేంపాడు ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద శనివారం కూలీ లకు అవగాహన కల్పించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణించుట వలన తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహన చోదకులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని కోరారు. కూలీలు ఆటోలు ఎక్కువగా కూలీలతో నిలబడి ప్రయాణిస్తున్నారని ఆవిధంగా ప్రయాణించటం వలన ప్రమాదం జరుగుతాయాని అన్నారు. ప్రమాదాలపై అవగాహన కల్పించి, రవాణా శాఖ నిబంధనలు పాటించాలని ఎస్ఐ నాగరాజు కోరారు.

## కౌన్సిలర్ కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ లలిత్‌సాగర్



దర్శి, మేజర్‌న్యూస్: నగర పంచాయతీలోని చింతల పాలెంలోని 20వార్డ్ కౌన్సిలర్ కనకం శ్రీనివాసరావు తల్లి కనకం సుబ్బులు ఇటీవల మృతి చెందారు. శ్రీనివాస రావు కుటుంబ సభ్యులను టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ పరామర్శించారు. ఆమె దశదిన కర్మ సందర్భంగా కనకం సుబ్బులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన టిడిపి యువనాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ తెలిపారు. ఆయన వెంట దర్శి పట్టణం టిడిపి అధ్యక్షులు యాదగిరి వాసు. టిడిపి నాయకులు జూపల్లి కోటేశ్వరరావు, వారితో పాటు వివిద హెూదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలలో జనసేన ఇంచార్జ్ గౌతమ్‌రాజు



పెద్దారవీడు, మేజర్‌న్యూస్: మండలంలోని సుంకేసుల గ్రామ జనసేన కార్యకర్త వినయ్ కుమార్ వివాహ మహెూత్సవానికి హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్, జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ పాకనాటి గౌతమ్ రాజు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఏకలవ్య మోడల్ పాఠశాలల్లో ఘనంగా ఫేర్‌వెల్





పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండలంలోని ఏకలవ్య మోడల్ స్కూల్లో పాఠశాలలో శనివారము ఫేర్వెల్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన నృత్యాలు అందరినీ అలరించాయి. ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వర్ సింగ్ భరద్వాజ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషిచేయాలని వైస్ ప్రిన్సిపాల్ వివేక్ సింగ్ అన్నారు. శనివారం 10వతరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలి అన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. పాఠశాలలో శనివారం విద్యార్థులు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమం అలరించింది. పదోతరగతి విద్యా ర్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో హంగామా చేశారు. ప్రతి విద్యార్థి తనకంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేసినట్లయితే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని భూమిని మంతయ్య పేర్కొన్నారు. పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ శ్రీను నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మంచిగా పరీక్షలు రాసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీచర్ చౌదరి. చందన్ సర్కార్, రతన్ సర్కార్, రామేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఇష్టపడి చదవాలి





కనిగిరి, మేజర్‌న్యూస్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 56వ వార్షికోత్సవ వేడుకలు,సెకండ్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు ప్రిన్సిపల్ పి.రమణారెడ్డి అధ్యక్షతన శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపల్ రమణారెడ్డి సొంత నిధులతో సుమారు రెండు లక్షల ఖర్చు చేసిన కళా ప్రాంగణాన్ని ప్రారంభోత్సవం చేశారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. ఆటల పోటీలలో, చదువులలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పామూరు, పొన్నలూరు జీజేసి ప్రిన్సిపాళ్లు కె.రాజశేఖర్, జి.రాజేంద్రబాబు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు నారాయణ రెడ్డి, రామి రెడ్డి, జెవివి నాయకులు గయాజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



అద్దంకి, మేజర్‌న్యూస్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం గొరకాయపాలెం పట్టణఆరోగ్యకేంద్రం జరిగింది. వైద్యాధికారి డాక్టర్ గొట్టిపాటి జయసింహ మాట్లాడుతూ తీసుకున్న ఆహారం పూర్తిగా శరీరానికి అందేందుకు నులిపురుల నివారణ మాత్రలు అవసరమన్నారు. ఈనెల 10వ తేదీన దేశవ్యాప్తంగా నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల నుంచి కళాశాల విద్యార్థుల వరకు ఈ టీకాలు అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. తీసుకునే ఆహారం శరీరానికి అందకుండా నులిపరుగులు అడ్డుకుంటున్నాయని, వీటిని నివారిస్తేనే పిల్లల్లో ఎదుగుదల ఉంటుందన్నారు. అలాగే విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెప్పారు.గతంలో ప్రభుత్వ పాఠశాలల్లోనే నిర్వహిస్తుండగా, తాజాగా అన్ని విద్యాలయాల్లోని చిన్నారులకు మాత్రలు వేయనున్నట్లు వెల్లడించారు. అద్దంకి పట్టణం,గ్రామీణంలో కలిపి 17871 మంది చిన్నారులకు టీకాలు అందించాలనే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు ఆయన వెల్లడించారు. అంగన్వాడీలు, పాఠశాలలు, కళాశాలల్ని గుర్తించి అందులోని వారికి మాత్రలు అందించనున్నట్లు చెప్పారు.

## స్టెమి చికిత్సతో గుండెకు భరోసా: డాక్టర్ సిద్ధార్థ్



బాపట్ల, మేజర్‌న్యూస్: గుండె జబ్బుల మరణాలను నివారించేందుకే స్టెమి చికిత్స గుండెకు భరోసా కలిపిస్తుందనీ బాపట్ల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కొప్పుల సిద్ధార్థ్ అన్నారు. చాతి నొప్పి, ఎడమ భుజం లాగటం, ఆయాసం ఉండటం, గుండె దడ, నీరసంగా ఉండడం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే అప్రమత్తమై దగ్గరగా ఉన్న ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. శ్రీ పొట్టి శ్రీరాములు ఏరియా వైద్యశాలలో రూ.45 వేలు విలువ చేసిన స్టెమి ఇంజక్షన్ 4 అందుబాటులో ఉంచామన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం 36 ఇంజక్షన్ లు అందించిందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ ఇంజక్షన్ గుండె నిలుపుదల చేసి తదుపరి ట్రీట్మెంట్ చేయడానికి జిల్లా కేంద్ర ఆస్పత్రులకు తరలించి ఈసీజీ ఆపరేషన్ చేసి ప్రాణాన్ని కాపాడుకునే అవకాశం ఉంటుందని, ఇది ప్రజలందరూ గమనించి ఎవరికైనా ఇటువంటి లక్షణాలు కలిగితే వెంటనే ఏరియా వైద్యశాలను సంప్రదించాలని కోరారు.

## లాటరీ పద్ధతిలో రేపు కలెక్టరేట్‌లో దుకాణాలు కేటాయింపు



బాపట్ల, మేజర్‌న్యూస్: ప్రొహిబిషన్, ఎక్సైజ్ బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, రేపల్లె, వేమూరు, నగరం, చీరాల, పర్చూరు, అద్దంకి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ల (7) పరిధిలో 2024 2026 సం.లకు గాను 12 ఎ 4 మద్యము దుకాణాలను గీత కులాల అభ్యర్థులకు కేటాయించడం జరిగినది. దరఖాస్తుల స్వీకరణ శనివారం అనగా 08.02.2025 సాయంత్రం 5:00 గంటలకు ముగిసినది. కావున ఈ 12 దుకాణాలకు 159 అప్లికేషన్ లు వేసిన దరఖాస్తుదారులు (గౌడ్, గౌడ కులస్తులు) అందరు 10.02.2025 వ తేదీ బాపట్ల లోని కలెక్టర్ ఆఫీసులో పి జి ఆర్ ఎస్ హాల్ లో జిల్లా కలెక్టర్ సమక్షమున లాటరీ పద్ధతిలో షాపులు కేటాయించబడును కనుక దరఖాస్తుదారులు అందరూ 10.02.2025 వ తేదీ ఉదయము 8 గంటలకు కలెక్టరేట్ కార్యాలయం లో ప్రజా సమస్య పరిష్కార వేదిక సమావేశ మందిరం వద్దకు చేరుకోవాలని కోరారు జిల్లా ఎక్సైజ్ అధికారి జి. దేవదత్తు, ఎక్సైజ్ సీఐ పాలపర్తి గీతిక.

## ఢిల్లీలో బిజెపి సంబరాలు



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: ఢిల్లీ అసెంబ్లీకి జరిగిన ఎన్నికలలో బిజెపి ఘన విజయం సాధించటం పట్ల సంతనూతలపాడులో మండల బిజెపి అధ్యక్షులు బావినేని కళ్యాణ్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి స్వీట్స్ పంపిణీ చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ, నాయకత్వంలో ఢిల్లీలో బిజెపి ఘన విజయం సాధించడం పట్ల సంతనూతలపాడు మండల బిజెపి అధ్యక్షులు బాలినేని కళ్యాణ్ రెడ్డి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నట్టు కళ్యాణ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కౌన్సిలర్ సంకే సుబ్బారావు, కిసాన్ మోర్చే జిల్లా ఉపాధ్యక్షులు మందాడి సుబ్బారావు, మండల బిజెపి మాజీ ఉపాధ్యక్షులు తెల్ల మేకల శ్రీనివాసరావు, బిజెపి నాయకులు బాలినేని చెంచి రెడ్డి, మన్నం రామారావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వైయస్సార్ పార్టీ జిల్లా సెక్రెటరీగా గొలమారి బాలకోటిరెడ్డి



త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లా వైసిపిలో జిల్లా అధ్యక్ష పదవి తర్వాత మిగిలిన పదవులను నియోజకవర్గాల వారీగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అందులో భాగంగా త్రిపురాంతకం మండలంలోని వెల్ల ఒపల్లి గ్రామానికి చెందిన గొలమారి బాలకోటి రెడ్డి గతంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా కొనసాగారు ఆ తరువాత మండల వైసిపిలో చేరి కొనసాగుతున్నారు. ఈ తరుణంలో జిల్లా జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఎంపికైన వారిలో గొలమారి బాల కోటిరెడ్డి తనకు పదవి కట్టబెట్టిన ఎర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.